తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సంపుటి: 2 | సంచిక: 219 | సోమవారం 30 –12–2024 | పేజీలు: 08 | వెల: 5 | www.telanganamuchatlu.in




# రైతుభరోసాకు కట్టుబడి ఉన్నాం

- ఎన్ని ఇబ్బందులు ఉన్నా హామీ నెరవేరుస్తాం
- ప్రజా ప్రభుత్వంలో రైతుకు భరోసా
- బడ్జెట్లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.72,659 కోట్లు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

ప్రజా ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చేందుకు కట్టుబడి ఉంది.. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన మాట మేరకు ముందుకు వెళ్తామని రైతు భరోసా సబ్ కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రైతు భరోసా సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క తో పాటు మంత్రులు, కమిటీ సభ్యులైన తుమ్మల నాగేశ్వరరావు, దుదిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమావేశం అయ్యారు. రానున్న యాసంగి పంటకు రైతు భరోసా అందజేసేందుకు ఖరారు చేయాల్సిన విధి విధానాలపై రెండు గంటల పాటు మంత్రులు కసరత్తు చేశారు. పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు రైతు భరోసా అందించిన తీరు.. క్యాబినెట్ సబ్ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన క్రమంలో రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు .. అధికారులు సేకరించిన సమాచారం పైన మంత్రులు

మిగతా 2లో



# నేడు తెలంగాణ అసెంబ్లీ సమావేశం..

- నేడు తెలంగాణ అసెంబ్లీ మూడవ సమావేశం
- ఈ సమావేశాల కోసం ప్రభుత్వం ఎజెండాను విడుదల
- అసెంబ్లీ సెక్రటరీ వీ నరసింహా చార్యులు ప్రకటించిన ఎజెండా

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

నేడు తెలంగాణ అసెంబ్లీ మూడవ సమావేశం జరగనుంది. ఈ సమావేశాల కోసం ప్రభుత్వం ఎజెండాను విడుదల చేసింది. అసెంబ్లీ సెక్రటరీ వీ నరసింహా చార్యులు ప్రకటించిన ఎజెండా ప్రకారం, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి నేపథ్యంలో రాష్ట్రంలో ఏడు రోజుల పాటు సంతాప దినాలను పాటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు కూడా జారీచేశారు.

సంతాప దినాల సందర్భంగా అసెంబ్లీ వేదికగా మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించేందుకు శాసన సభ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తోంది. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ ప్రధానమంత్రి మృతిపై సంతాప తీర్మాణాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా, ప్రధాన మంత్రిగా దేశానికి అందించిన సేవలను గుర్తుచేస్తూ, ఆయన చేసిన కృషిని సభలో ప్రస్తావించనున్నారు. రేవంత్ రెడ్డితో పాటు శాసనసభ సభ్యులు కూడా మాజీ ప్రధానమంత్రిపై తమ సంతాపాన్ని తెలియజేస్తారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తారు.

# నేను బీజేపీలో ఉన్నందుకు గర్వపడుతున్నాను

- 140 కోట్ల ప్రజలున్న మన భారత దేశం ప్రశాంతంగా ఉండడానికి కారణం బీజేపీ
- మన నాయకుడు మోడీ అని ప్రజలందరికీ అర్థం అయ్యింది : ఈటల రాజేందర్

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

నేను బీజేపీలో ఉన్నందుకు గర్వపడుతున్నానని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 140 కోట్ల ప్రజలున్న మన భారత దేశం ప్రశాంతంగా ఉండడానికి కారణం బీజేపీ, మన నాయకుడు మోదీ అని ప్రజలందరికీ అర్థం అయ్యిందన్నారు. తెలంగాణలో హైదారాబాద్ చుట్టు గెలిచిన పార్టీ మనదని, జిహెచ్ఎంసి ఎన్నికల్లో వికసించేది కూడా బీజేపీనే అని ఆయన వ్యాఖ్యానించారు. మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అధికార పార్టీకి 40 శాతం ఓట్లు వస్తే బిజెపికి 35% ఓట్లు వచ్చాయి. ఇక భవిష్యత్తు భారతీయ జనతా పార్టీదే అని ఈటల రాజేందర్ అన్నారు.మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ గారి ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో భారీ చేరికలు జరిగాయి. బీజేపీ పార్టీలో జాయిన్ అయిన నేరెడ్ మేట్ కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి, సాయి కిరణ్ రెడ్డి, ఆకారం సాయి తదితరులు చేరారు. అనంతరం ఈటల మాట్లాడుతూ.. ఏ



పార్టీలో అయినా జాతీయ అధ్యక్షుడు దగ్గరనుండి గ్రామస్థాయి

మిగతా 2లో

# కేసీఆర్‌ను ఎదుర్కోలేకే అక్రమ కేసులు

- కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ములేక.. నాపై, కేటీఆర్ పై అక్రమ కేసులు పెట్టారు..
- ఎన్ని కేసులు పెట్టినా నిప్పు కణికల్లా బయటికి వస్తాం
- మన సంస్కృతిపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం దాడి చేస్తుంది..



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

కేసీఆర్‌ను ఎదుర్కొనే ధైర్యం, దమ్ములేక నాపై, కేటీఆర్ పై అక్రమ కేసులు పెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ పర్యటనలో భాగంగా కవిత మాట్లాడుతూ.. ఎన్ని కేసులు పెట్టిన భయ పడేది లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేసిందన్నారు. బస్సుల సంఖ్య తగ్గించి ఫ్రీ బస్సు ఇస్తున్నారని తెలిపారు. అనేక ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా పిడికిలి ఎత్తి అన్ని ఎదురించి వచ్చానని కవిత అన్నారు. నేను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను___ దేనికీ భయపడనని అన్నారు. మాది భయపడే రక్తం కాదు.. భయపెట్టే రక్తం అన్నారు. మేము తప్పు చేయలేదు___ భయపడే ప్రసక్తే లేదన్నారు.ఎన్ని కేసులు పెట్టిన బీఆర్ఎస్ కార్యకర్తలు నిప్పు కణికల్లా బయటికి వస్తారన్నారు. కేంద్రాన్ని ఎదురించి ప్రశ్నిస్తే బీజేపీ కేసులు పెడుతోందన్నారు.

రాష్ట్రంలో అక్రమ కేసులపై గురించి చెప్పనవసరం లేదని తెలిపారు. రాబోయేది గులాబీ జెండా శకమే.. అందులో సందేహమే లేదని కవిత అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చంద్ర బాబు శిష్యుడని తెలిపారు. తెలంగాణ తల్లిని మరచిపోవాలని అంటున్నారన్నారు. తెలంగాణ తల్లి మాది, కాంగ్రెస్ తల్లి మీదన్నారు. తెలంగాణ సంస్కృతి పై దాడి జరుగుతుందన్నారు. పేరు మర్చిపోయినా, రైతులు భూములు ఇవ్వకపోయినా సీఎం రేవంత్ కేసులు పెడుతున్నారని కవిత పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఎందుకింత భయం ? అని ప్రశ్నించారు. డిగ్రీ చదువుకున్న

మిగతా 2లో



# రైతుభరోసా అమలుకు సాంకేతిక సాయం

- ఉపగ్రహ పరిజ్ఞానంతో సాగు భూముల గుర్తింపు
- మంత్రి తుమ్మల వెల్లడి
- డేటా కంపెనీల ప్రతినిధులతో సమావేశం

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

సాగులో ఉన్న భూమికి మాత్రమే 'రైతుభరోసా' పథకం కింద పెట్టుబడి సాయం అందిస్తామని, ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామాల్లో సర్వే నంబర్ల వారీగా సాగుభూముల వివరాలు సేకరించి అమలు చేస్తామని వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సంక్రాంతి తర్వాత నుంచి రైతుభరోసా అమలు

మిగతా 2లో

# కేటీఆర్‌కు ఈడీ పిలుపు

- ఫార్ములా-ఈ రేస్ కేసులో 7న విచారణకు హాజరు కావాలని సమన్లు
- 2న బీఎల్ఎన్‌రెడ్డి.. 3న అర్వింద్‌కుమార్‌ల విచారణ
- ఎఫ్ఈవోకు విదేశీ కరెన్సీ చెల్లింపుపై ఆరా తీసే అవకాశం

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**



ఫార్ములాఈ రేస్ దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వేగం పెంచింది. నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు నిధులు బదలాయించారనే ఆరోపణలపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే మాజీమంత్రి కేటీఆర్, హెచ్ఎండీఏ పూర్వ కమిషనర్ అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డిలను విచారించి వివరాలు రాబట్టాలని నిర్ణయించింది. జనవరి 2న బీఎల్ఎన్‌రెడ్డి, 3న అర్వింద్‌కుమార్, 7న కేటీఆర్ విచారణకు రావాలని తాజాగా ఈడీ సమన్లు జారీ చేసింది. ఈ వ్యవహారంపై తెలంగాణ ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. హైదరాబాద్‌లో ఫార్ములాఈ కార్ రేస్‌లను నిర్వహించేందుకు యూకేకు చెందిన ఫార్ములాఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో)కు గ్రేట్ బ్రిటన్ పౌండ్ల రూపంలో సొమ్ము బదిలీ చేయడంపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. ఈ నిధులకు అంతిమ లబ్ధిదారులెవరైనా ఉన్నారా

మిగతా 2లో




# తెలంగాణలో పోలీసుల ఆత్మహత్యలపై స్పందించిన డీజీపీ

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల ఆత్మహత్యలపై డీజీపీ జితేందర్ స్పందించారు. ఈ ఏడాదే కాదు, ప్రతి సంవత్సరం

మిగతా 2లో



# రాష్ట్రంలో అఘాయిత్యాలు పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది

- రాష్ట్రంలో మహిళలు, మైనర్ బాలికలపై అఘాయిత్యాలు పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది
- ప్రభుత్వ వైఫల్యానికి ఇదే నిదర్శనం : మాజీ మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్రంలో మహిళలు, మైనర్ బాలికలపై అఘాయిత్యాలు పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని, ప్రభుత్వ వైఫల్యానికి ఇదే నిదర్శనమన్నారు మాజీ మంత్రి హరీష్ రావు. గత సంవత్సరంతో పోలిస్తే తెలంగాణలో నేరాల రేటు 22.5% పెరిగిందన్నారు. అత్యాచార కేసులు 28.94% పెరిగాయని, ఏడాదిలో మొత్తం 2,945 కేసులు నమోదయ్యాయన్నారు. సగటున రోజుకు 8 కేసులు నమోదవుతున్నాయని ఆయన మండిపడ్డారు. ఇందులో 82 మైనర్ బాలికలపై అఘాయిత్యాలు జరగడం సిగ్గుచేటని హరీష్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు భద్రత లేదని తెలుస్తున్నది.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజా

మిగతా 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# రైతుభరోసాకు కట్టుబడి ఉన్నాం

మొదటి పేజీ తరువాయి



కసరత్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట మేరకు రైతులకు రైతు భరోసా ఇచ్చి తీరుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయం అనుబంధ రంగాలకు 72,659 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న కమిట్మెంట్ ను ఈ అంకెలు తెలియజేస్తాయని డిప్యూటీ సీఎం తెలిపారు. రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ కింద రెండు నెలల వ్యవధిలోనే 21 వేల కోట్ల రూపాయల నగదును రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతుల సంక్షేమానికి కృషి చేసేందుకు వ్యవసాయ కమిషన్ ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో నిర్మించిన రైతు వేదికలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించామని తెలిపారు. రైతు వేదికలను ఆధునీకీకరించేందుకు ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమాన్ని చేపట్టింది, రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ను అనుసంధానం చేసి రైతు సమస్యలను పరిష్కరించేందుకు రైతు నేస్తం కార్యక్రమాన్ని చేపట్టినట్టు వివరించారు. 110 రైతు వేదికల్లో నాలుగు కోట్ల పైగా నిధులు వెచ్చించి వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తెలంగాణ రైతులు దేశానికి ఆదర్శంగా ఉండేలా ప్రజా ప్రభుత్వం తొలి ఏడాదిలోనే యాసంగి పంటకు పెట్టుబడి సాయంగా రాష్ట్రంలోని రైతులందరికీ రైతు భరోసా నిధులు విడుదల చేసిన విషయాన్ని వివరించారు. 1,57,51000 ఎకరాలకు 7,625 కోట్ల నిధులు రైతుల ఖాతాలో జమ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఏడాది పాటు శ్రమించిన అనుకోని ప్రకృతి విపత్తులతో పండిన పంట చేతికి వస్తుందో రాదో అని భయాలు నిత్యం రైతులను వెంటాడుతున్నాయి, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు.పంటల బీమా పథకం కింద ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే రైతుల పక్షాన చెల్లిస్తుందని తెలిపారు. పంటలకే కాదు రైతు కుటుంబానికి భరోసాగా నిలిచేందుకు రైతు బీమా పథకం కింద రైతులకు పక్షాన ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుంది అన్నారు. 202425 లో రాష్ట్రంలో ఒక లక్ష ఎకరాల ఆయిల్ ఫామ్ సాగును చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. 202324 ఏడాదికి గాను ఆయిల్ సాగు పథకం కింద కేంద్ర ప్రభుత్వం 80.10 కోట్లు విడుదల చేయగా రాష్ట్ర వాటా కలుపుకొని మొత్తం 133.5 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసే సన్నధాన్యానికి ప్రతి క్వింటాకు 500 రూపాయలు బోనస్ గా చెల్లిస్తుందని తెలిపారు. గత వాన కాలంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జిల్లాల్లో దాన్యం కొనుగోలు సాఫీగా జరిగేందుకు జిల్లాల వారీగా సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి రఘు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో పోలీసుల ఆత్మహత్యలపై స్పందించిన డీజీపీ

మొదటి పేజీ తరువాయి



ఏదో ఒక కారణంతో సూసైడ్ చేసుకుంటున్నారని డీజీపీ అన్నారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఆర్థిక, వ్యక్తిగత ఇబ్బందులు, ఫ్యామిలీ సమస్యలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కొన్ని కేసుల్లో పని ఒత్తిడి వలన కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని డీజీపీ వెల్లడించారు. పోలీసులకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అల్లు అర్జున్ కేసు కోర్టు పరిధిలో ఉందని.. సమగ్ర విచారణ జరుగుతుందని డీజీపీ పేర్కొన్నారు.

## రైతుభరోసా అమలుకు సాంకేతిక సాయం

మొదటి పేజీ తరువాయి



సన్నాహాల్లో భాగంగా రిమోట్ సెన్సింగ్ డేటా ఆధారంగా సాగు విస్తీర్ణాన్ని అంచనా వేయగల వివిధ కంపెనీల ప్రతినిధులతో మంత్రి శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, సంచాలకుడు గోపి, ఇతర అధికారులు ఇందులో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ''సాగు చేసిన భూముల వివరాలను వ్యవసాయ విస్తరణాధికారుల ద్వారా ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నాం. దీంతోపాటు రైతుభరోసా అమలులో కచ్చితత్వం కోసం ఉపగ్రహ డేటా పరిజ్ఞానాన్ని వినియోగిస్తాం. గ్రామాల్లో సర్వే నంబర్ల వారీగా సాగులో ఉన్న భూముల విస్తీర్ణం, పంటల వివరాలతో పాటు సాగుకు అనువుగా లేని భూములను గుర్తిస్తాం. దీన్ని రైతుభరోసా, పంటల బీమా పథకాలకు ప్రామాణికంగా తీసుకుంటాం. పంటల స్థితిగతులు, ఎదుగుదల, చీడపీడల గుర్తింపు, వరదలు, తుపానుల వల్ల జరిగే పంటనష్టం అంచనాలకు కూడా ఈ పరిజ్ఞానాన్ని వినియోగిస్తాం. రిమోట్ సెన్సింగ్ పరిజ్ఞానంతో పనిచేసే కంపెనీలు పంటల సాగుకు సంబంధించిన వివరాలను సమర్పిస్తే ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ పరిశీలించాక.. మంత్రిమండలి ఆమోదానికి పంపి తుది నిర్ణయం తీసుకుంటాం'' అని మంత్రి తెలిపారు. అంతకుముందు కంపెనీల ప్రతినిధులు.. రెండు మండలాల్లో గ్రామాలవారీగా తాము సేకరించిన సాగుభూములు, పంటల వివరాలను మ్యాప్‌ల రూపంలో తెరపై ప్రదర్శించి వివరించారు. సాగుకు అనువుగా లేని ప్రాంతాలను డిజిటల్ మ్యాప్స్ ద్వారా చూపించారు. పంటల్లో చీడపీడలను ఆరంభంలో గుర్తించేలా కృత్రిమమేధ పరిజ్ఞానంతో తయారు చేసిన మ్యాప్‌ల గురించి వివరించారు.





## ఓఆర్ఆర్ అమ్ముకున్న వాళ్ళపై విచారణకి అదేశించాం

- మంత్రి కోమటిరెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి ఫోన్
- ఓఆర్ఆర్ నార్త్ టెండర్ ప్రక్రియ ప్రారంభంపై కోమటిరెడ్డికి సీఎం అభినందన
- 2017లో ఆగిపోయిన ప్రాజెక్టును ఏడాదిలోపే ప్రారంభించడంలో మీ సహకారం, కృషితోనే సాధ్యమైందని తెలిపిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

ఓఆర్ఆర్ అమ్ముకున్న వాళ్ళ పై విచారణ కి అదేశించామన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం 7 వేల కోట్లకు అమ్మిందని ఆయన అన్నారు. హరీష్ రావు కి.. మామ మీదనో.. బామ్మర్ది మీదనో కోపం తోటి అసెంబ్లీ లో విచారణ కి డిమాండ్ చేశారన్నారు. సీఎం విచారణకు ఆదేశించారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఈ ఫార్ములా రేసు కేసులో ఒకరో ఇద్దరో జైలుకి పోతారని, ఓఆర్ఆర్ ఎపిసోడ్ లో కూడా జైలు కి వెళ్తారన్నారు. ఓఆర్ఆర్ కి అరెండ్లు ఆలస్యం అయ్యిందన్నారు మంత్రి కోమటిరెడ్డి. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చామని, టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. మార్చిలో ఓఆర్ఆర్ పనులు ప్రారంభమవుతాయన్నారు.ఇదిలా ఉంటే.. ఓఆర్ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి టెండర్ల ప్రక్రియకు కేంద్రం ప్రకటన చేయడం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఆర్ఆర్ఆర్ పనులకు కీలక ముందడుగు పడడంతో... మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ప్రత్యేకంగా ఫోన్ చేసి మాట్లాడారు. అందుకు కోమటిరెడ్డి బదులిస్తూ... మీ చొరవ, కృషి, సహకారం, సలహాలతోనే ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు పట్టాలెక్కిందని రేవంత్ రెడ్డిని ప్రశంసించారు. 2017లో ఆగిపోయిన ప్రాజెక్టు... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే మీ సహకారం వల్ల తిరిగి ప్రారంభమైందని కొనియాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేసిన ఓయూ జేఏసీ నేతలకు బెదిరింపులు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**




అల్లు అర్జున్ అభిమానుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయంటూ ఓయూ విద్యార్థి జేఏసీ నేతలు ఓయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ''ఇంటిపై దాడి చేసినందుకు వెంటనే అల్లు అర్జున్‌కు క్షమాపణ చెప్పాలని అల్లు అర్మీ, అల్లు అర్జున్ ఫ్యాన్స్ పేరుతో వందల కాల్స్ వస్తున్నాయి. చంపేస్తామని బెదిరిస్తున్నారు. అల్లు అర్జున్ అభిమానుల నుంచి మాకు ప్రాణహాని ఉంది. మా ఫోన్ నెంబర్లు సోషల్ మీడియాలో పెట్టి వైరల్ చేస్తున్నారు. మాకు ఫోన్ కాల్స్ రాకుండా చేయాల్సిన బాధ్యత అల్లు అర్జున్‌దే. ఫోన్ కాల్స్ ఆగకపోతే వేలాది మందితో అల్లు అర్జున్ ఇంటిని ముట్టడిస్తాం. ఫోన్ చేసి బెదిరిస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి'' అని ఫిర్యాదులో పేర్కొన్నారు.సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి మరణానికి అల్లు అర్జున్ కారణమంటూ ఇటీవల ఓయూ విద్యార్థి జేఏసీ నేతలు ఆందోళనకు దిగారు. రేవతి కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ అల్లు అర్జున్ నివాసంపై రాళ్లు విసిరారు. ఆయన ఇంట్లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. రాళ్లు తగిలి అల్లు అర్జున్ ఇంటి ఆవరణలోని పూల కుండీలు ధ్వంసమయ్యాయి.

## నేను బీజేపీలో ఉన్నందుకు గర్వపడుతున్నాను

మొదటి పేజీ తరువాయి



కార్యకర్త వరకు ఈ పార్టీ నాది అనే భావన లేకపోతే ఆ పార్టీ బ్రతకదు. ప్రతి ఒక్కరూ ఓనర్లే అని ఆయన అన్నారు. బీజేపీలో కూడా ప్రతి ఒక్కరూ ఓనర్ లెక్కనే ఉంటారని, ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీ బీజేపీ అని ఆయన అన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహిస్తున్న పార్టీ బీజేపీ అని ఈటల రాజేందర్ తెలిపారు.

అంతేకాకుండా..'దేశానికి దిక్సూచి మోదీ తప్ప ఎవరు కనిపించడం లేదు అని సీనియర్ బీఆర్ఎస్ , కాంగ్రెస్ నాయకులు ఈరోజు నాతో అన్నారు. ఆ మాటలు విని నేను గర్వపడ్డా. మహాభారతంలో సంజయుడికి మాత్రమే ఎక్కడ ఏం జరుగుతుందో చూసే శక్తి ఉండేది.. ఆయనే ధృతరాష్ట్రునికి యుద్ధంలో ఏం జరుగుతుందో కళ్ళకు కట్టినట్లు చెప్పేవాడు. కానీ ఈనాడు సెల్ ఫోన్ ద్వారా ప్రపంచంలో ఏం జరుగుతుందో ప్రతి సామాన్యుడు తెలుసుకుంటున్నాడు. ప్రతి ఒక్కరూ సంజయుడే. సిరియా, ఇరాక్, ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ లో జరుగుతున్న నరమేదాన్ని గమనిస్తున్నారు. 140 కోట్ల ప్రజలున్న మన భారత దేశం ప్రశాంతంగా ఉండడానికి కారణం బీజేపీ, మన నాయకుడు మోదీ అని అందరికీ అర్థం అయ్యింది. భారత జాతి అంతా అదే భావనకు వచ్చింది.

మొన్న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి అధికారం ఇచ్చాం కానీ ఇంకా శక్తివంతం చేయాల్సిఉండే అనే అభిప్రాయం పార్లమెంటులో జరిగే పరిణామాలు చూసి అనుకుంటున్నారు. ఎక్కడో తప్పు జరిగింది.. ఆ శక్తి ఇచ్చి ఉంటే భారత్ ఇంకా సుభిక్షంగా ఉండేదని భావిస్తున్నారు. అందుకే ఏ ఎన్నిక జరిగినా బీజేపీకే పట్టం కడుతున్నారు. మోదీ ఆయురారోగ్యాలతో ఉండి మరింతకాలం ఈ దేశానికి నాయకత్వం వహించాలని కోరుకుంటున్నారు. ప్రపంచంలో ఏ మూలన ఉన్న నేను భారతీయుణ్ణి అని గర్వంగా చెప్పుకునే స్థితిని తీసుకొచ్చిన ఘనత నరేంద్ర మోదీ గారిది.

కరోనా కష్టకాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో ఉంటే మనది మాత్రం స్థిరంగా ఉండటమే కాదు ఇప్పుడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం భారతదేశం. 11వ స్థానం నుండి 5వ స్థానానికి ఎదిగింది. మూడవ స్థానంలో నిలబెట్టాలి అనేది మోదీ గారి సంకల్పం. ప్రపంచంలో దేశానికి అయినా అన్నం పెట్టే స్థాయికి ఎదిగింది. అందుకే ప్రజలందరి గుండెల్లో మోడీ స్థానం సంపాదించుకున్నారు. వికసిత భారత్ కోసం కలలు కంటున్నారు.

భారతదేశం విశ్వగురువుగా ఎదగటానికి మోదీ వేసిన పునాది పని చేస్తుంది. తెలంగాణ లో హైదరాబాద్ చుట్టు గెలిచిన పార్టీ మనది. జిహెచ్ఎంసి ఎన్నికల్లో వికసించేది కూడా బీజేపీనే. మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అధికార పార్టీకి 40 శాతం ఓట్లు వస్తే బిజెపికి 35% ఓట్లు వచ్చాయి. ఇక భవిష్యత్తు భారతీయ జనతా పార్టీదే.' అని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.





## కేసీఆర్‌ను ఎదుర్కోలేకే అక్రమ కేసులు

మొదటి పేజీ తరువాయి

ఆడపిల్లలకు స్కూటీల పంపిణీ ఏమైంది ? మహిళలకు నెలకు రూ. 2500, కళ్యాణ లక్ష్మీ కింద తులం బంగారం ఇవ్వలేదుని గుర్తు చేశారు.

మైనారిటీలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా కాంగ్రెస్ సర్కార్ అమలు చేయలేదని మండిపడ్డారు. బీరాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం .... ఇప్పటి వరకు పెన్షన్లు మొత్తాన్ని పెంచలేదన్నారు. మనం ఊరుకుంటే ప్రభుత్వం కదలదు... ప్రతీ ఒక్కరు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపు నిచ్చారు. పీపుల్స్ ఫ్రెండ్లీ పోలిసింగ్ పోయి... రాష్ట్రంలో కాంగ్రెస్ ఫ్రెండ్లీ పోలీసింగ్ నడుస్తోందన్నారు. రాష్ట్రంలో పోలీసు జులుం నడుస్తుందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన మంచి పనులను ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాబోయేది గులాబీ జెండా శకమే... అందులో సందేహమే లేదన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే అన్నారు. గురుకులాలను పడడానికి కూడా ప్రభుత్వానికి చేతకావడం లేదన్నారు. ఇప్పటికే 57 మంది పిల్లలను పొట్టనపెట్టుకున్నారు.. ఇంకెంత మందిని పొట్టనపెట్టుకుంటారు ? అని మండిపడ్డారు కవిత. ఉద్యోగాల పేరిట సీఎం రేవంత్ రెడ్డి యువతను తప్పదోవ పట్టిస్తున్నారన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పటి వరకు కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకే ఉద్యోగాలు ఇస్తున్నారన్నారు. మన పొట్టమీదనే కాదు... మన సంస్కృతిపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం దాడి చేస్తుందన్నారు. మళ్లొకసారి నిజామాబాద్ పవర్ ను సీఎం రేవంత్ రెడ్డికి రుచి చూపిద్దామన్నారు.



## కేటీఆర్‌కు ఈడీ పిలుపు

మొదటి పేజీ తరువాయి

అనే కోణంలో ఆరా తీస్తోంది. తొలుత అధికారులను విచారించాక.. లభించే సమాచారం ఆధారంగా కేటీఆర్‌ను విచారించాలని ఈడీ అధికారులు భావిస్తున్నారు. అప్పట్లో మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆదేశాలతోనే ఎఫ్‌ఈవోకు నిధులు బదిలీ చేసినట్లు అర్వింద్‌కుమార్ గత జనవరిలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లిఖితపూర్వక వాంగ్మూలం ఇవ్వడంతో ఈడీ తాజా దర్యాప్తు చర్చనీయాంశంగా మారింది. అయితే విచారణకు హాజరయ్యేందుకు తనకు కొంత గడువు ఇవ్వాలని ఈడీ అధికారులను కేటీఆర్ కోరినట్లు తెలుస్తోంది.

**నగదు బదిలీలో మతలబులపై దర్యాప్తు**

రుసుంలు, పన్నుల కింద 90 లక్షల గ్రేట్ బ్రిటన్ పౌండ్ల (సుమారు రూ.110 కోట్ల)తో పాటు రేస్ నిర్వహణకు అయ్యే పనుల నిమిత్తం మరో రూ.50 కోట్లు ఎఫ్‌ఈవోకు చెల్లించేందుకు హెచ్ఎండీఏ నుంచి మంజూరు చేశారు. ఈ మేరకు బీఎల్ఎన్‌రెడ్డి హిమాయత్‌నగర్‌లోని ఐవోబీ బ్రాంచి నుంచి 2023 అక్టోబరులో రెండు విడతల్లో సుమారు రూ.45.71 కోట్లను గ్రేట్‌బ్రిటన్ పౌండ్లలోకి మార్చి లండన్‌లోని ఎఫ్‌ఈవో ఖాతాకు బదిలీ చేశారు. ఆర్‌బీఐ అనుమతి పొందకపోవడం, పన్ను మినహాయించకుండా బదిలీ చేయడం వివాదస్పదంగా మారింది. పన్ను మినహాయించకపోవడంతో ఆదాయపన్ను శాఖకు హెచ్ఎండీఏ అదనంగా సుమారు రూ.8.06 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. ఈ చెల్లింపులకు బాధ్యులెవరు? ఇందులో ఫెమా ఉల్లంఘనలేమైనా ఉన్నాయా? అని తేల్చడంలో ఈడీ నిమగ్నమైంది.

**ఎఫ్‌ఈవో నుంచీ వివరాల సేకరణ?**

నగదు బదిలీ అయిన బ్యాంకు నుంచి ఈడీ అధికారులు ఇప్పటికే వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఈ బ్యాంకు నుంచి లండన్‌లోని ఎఫ్‌ఈవో ఖాతాకు నిధులు చేరిన అనంతరం అవి మరెవరి ఖాతాల్లోకి బదిలీ అయ్యాయనేది ఈడీ ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం ఎఫ్‌ఈవో నుంచి వివరాలు సేకరించే అవకాశమున్నట్లు సమాచారం. మ్యూచువల్ లీగల్ అసిస్టెన్స్ ఇన్ క్రిమినల్ మ్యాటర్స్ (నేరపరమైన అంశాల్లో పరస్పర న్యాయ సహాయం)పై యూకేతో భారత్‌కు ఒప్పందమున్న నేపథ్యంలో లెటర్ ఆఫ్ రొగేటరీ (ఎల్ఆర్) ద్వారా సంప్రదింపులు జరిపే అవకాశం కనిపిస్తోంది.

## రాష్ట్రంలో అఘాయిత్యాలు పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది

మొదటి పేజీ తరువాయి

భద్రత పూర్తిగా దిగజారిందన్నారు.అంతేకాకుండా..'అంబర్‌పేటలో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ గంగారెడ్డి, ఆయన భార్య హత్య (నాలుగు నెలల క్రితం) కేసు ఇంకా పరిష్కారం కాలేదు. అలాగే, ఆరు నెలల క్రితం హత్యకు గురైన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్ రెడ్డి కేసులో కూడా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ ఘోర నేరాలకు ఇప్పటికీ న్యాయం దక్కకపోవడం శోచనీయం. తెలంగాణలో 163కి పైగా ప్రధాన కేసులు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. రూ.10 కోట్ల విలువైన ఆర్థిక మోసాలకు సంబంధించి రికవరీ జరగలేదు . రాష్ట్రంలో నేరాల గుర్తింపు రేటు 31%గా ఉంది, ఇది బీహార్‌లో లాంటి రాష్ట్రాలతో పోటీపడి పరిస్థితి ఏర్పడింది.ఘటన జరిగిన మొదటి వారం గోల్డెన్ పీరియడ్‌గా భావించబడుతున్నది . అయితే, ఆ సమయాన్ని వృథా చేయడం వల్ల బాధితులకు న్యాయం జరగడం లేదు, నిందితులు స్వేచ్ఛగా తిరుగుతున్న పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇది పోలీసుల వైఫల్యానికి నిదర్శనంగా కనిపిస్తుంది. హోం శాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనా వైఫల్యం వల్ల తెలంగాణ పోలీసులకు ఉన్న మంచి నైపుణ్యాన్ని,శక్తిని కోల్పోతున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కారణం.

మరోవైపు, ప్రజా భద్రత గురించి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నేతలు, రాజకీయ దాడులకు పాల్పడడం దుర్మార్గం. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడతారు. సోషల్ మీడియాలో అభిప్రాయం వ్యక్తం చేస్తే వేధింపులకు గురిచేస్తారు.

ఆఖరికి పేరు మర్చిపోతే కూడా కేసులు పెట్టి వేధిస్తారు. ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పోలీసులను వాడుకోకుండా ప్రజల భద్రత కోసం ల్యాండ్ ఆర్డర్ సంరక్షణ కోసం పోలీస్ శాఖను వాడితే బాగుంటుంది. రాష్ట్రంలో క్రైమ్ రేట్ తగ్గించడానికి మెరుగైన లా అండ్ ఆర్డర్ నిర్వహించేందుకు ప్రభుత్వం సకాలంలో పోలీస్ శాఖ బడ్జెట్ విడుదల చేసి పోలీస్ బలగా బలోపేతం చేయాలి. చిల్లర రాజకీయాల కంటే ప్రజల భద్రత ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజలకు పోలీసులపై నమ్మకాన్ని పెంచాలి వేగవంతమైన న్యాయాన్ని అందించాలి కానీ ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ఉపయోగించకూడదు.' అని హరీష్‌రావు అన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రాష్ట్రానికి వెల్లువెత్తుతున్న పెట్టుబడులు..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**



తెలంగాణలో ప్రజా ప్రభుత్వ సంకల్పం "రైజింగ్ తెలంగాణ" కల సాకారమవుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల సాధనలో రాష్ట్రం గణనీయమైన వృద్ధి సాధించిన నేపథ్యంలో ట్విట్టర్ వేదికగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ పురోగమిస్తోందంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఏడాది పాలనలో ప్రజా ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ పెట్టుబడులే నిదర్శమని వ్యాఖ్యానించారు.

దేశంలో విదేశీ సంస్థల పెట్టుబడులకు సంబంధించి కేంద్ర పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య విభాగం తాజాగా వివిధ రాష్ట్రాలు సాధించిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు - ఎఫ్ డీఐల వివరాలతో ఓ నివేదికను విడుదల చేసింది. ఇందులో.. తెలంగాణ రాష్ట్రం మంచి ఫలితాల్ని రాబట్టినట్లు స్పష్టమవుతోంది. 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో ఆరు నెలల్లోనే ఏకంగా రూ.12, 864 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. ఈ స్థాయిలో పెట్టుబడుల్ని ఆకర్షించడంతో దేశంలోని చాలా రాష్ట్రాల కంటే తెలంగాణ మంచి రాబడుల్ని సాధించింట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

గతేడాది ఇదే సమయంలో అంటే 2023 ఏప్రిల్ - సెప్టెంబర్ మధ్యలో కేవలం రూ. 9,679 కోట్లు. అంటే.. ఈ ఏడాది అదనంగా రూ.3,185 కోట్ల పెట్టుబడులు పెరిగాయి. ఇది ఏకంగా 33 శాతం అధికమని కేంద్ర ప్రభుత్వ నివేదిక తెలిపింది. ఈ ఏడాది ఆరు నెలల్లో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల్ని పరిగణలోకి తీసుకుంటే తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించిన ఆరో రాష్ట్రంగా గుర్తింపు సాధించింది. మన కంటే ముందు మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, దిల్లీ మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి.

తెలంగాణాలోనూ ఒక్క హైదరాబాదే అత్యధిక విదేశీ పెట్టుబడుల్ని ఆకర్షించింది. మొత్తం పెట్టుబడుల్లో ఏకంగా 93 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అంటే రూ. 11,970 కోట్లు హైదరాబాద్ నగరానికి వచ్చినట్లు గణాకాలు స్పష్టం చేస్తున్నాయి. ఆ తర్వాత రంగారెడ్డి జిల్లాకు అత్యధికంగా రూ.680.5 కోట్లు, మహబూబ్ నగర్ జిల్లాకు రూ. 116.70 కోట్లు, మెదక్ కు రూ. 96.99 కోట్ల మేర విదేశీ పెట్టుబడులు వచ్చినట్లు కేంద్రం విడుదల చేసిన నివేదిక తెలుపుతోంది.ఈ విషయాన్ని ప్రస్తావించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ) సాధనలో రాష్ట్రం గర్వించదగ్గ వృద్ధిని సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ కృషికి ఈ పెట్టుబడులే నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రమాణస్వీకారం చేసిన మొదటి నెల నుంచే దావోస్, అమెరికా, దక్షిణ కొరియా లాంటి దేశాల్లో పర్యటించి.. పెట్టుబడుల సాధన కోసం ప్రయత్నాలు చేసినట్లు తెలిపిన సీఎం. ఆ ప్రయత్నాలు మంచి ఫలితాల్ని ఇస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. 2023 ఏప్రిల్ - సెప్టెంబర్ తో పోల్చితే... 2024 ఏప్రిల్ - సెప్టెంబర్ ... అర్ధ సంవత్సరంలో అద్భుత లక్ష్యాలను సాధించామని అన్నారు.

ఈ స్థాయిలో పెట్టుబడులను సాధించడాన్ని ప్రభుత్వ విజయంగా చెప్పుకొచ్చిన రేవంత్ రెడ్డి.. యువత ఉపాధి - ఉద్యోగ కల్పనకు ప్రజా ప్రభుత్వం బలమైన సంకల్పంతో పని చేస్తుందనడానికి ఇది నిదర్శనమని అన్నారు. ఈ పురోగతి సాధనలో సహకరిస్తున్నప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ట్విట్టర్ ద్వారా తెలియజేశారు.

"మది మందిరంలో బంధించి
జ్ఞాపకాల మాలలతో అలంకరిస్తూ,
మౌనంగా ఆరాధిస్తూ
స్మరిస్తూ అర్చిస్తున్న
ప్రాణాన్ని నైవేద్యంగా అర్పించాను కృష్ణా..!!"



రాధికా ప్రియ




# డ్రగ్స్‌పై అవగాహనకు ఆన్‌లైన్ కోర్సు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్రంలో విద్యార్థులు, యువతకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీన్యాబ్) ఎడిస్టీస్ ఫౌండేషన్, క్రియాటె ఎడ్యుటెక్ సంస్థతో శనివారం ఒప్పందం కుదుర్చుకుంది. 'డ్రగ్‌ఫ్రీ వెల్‌నెస్' కార్యక్రమంలో భాగంగా పరస్పర సహకారంతో రాష్ట్రంలో డ్రగ్స్‌ను కట్టడి చేసేందుకు యువతను కార్యోన్ముఖులను చేస్తారు. మత్తు పదార్థాల వల్ల తలెత్తే సమస్యలు, అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ డ్రగ్‌ఫ్రీ వెల్‌నెస్ కోర్సు పూర్తి చేసినవారికి టీజీన్యాబ్ ద్వారా సర్టిఫికెట్ అందజేస్తారు. బంజారాహిల్స్ పోలీసు కమాండ్ కంట్రోల్ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీజీన్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఎస్పీ సాయిచైతన్య, సంస్థ ప్రతినిధులు సంస్కృతి కొండూరు, శ్రీహర్షిత ఛాడ తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాదీలకు అలర్ట్.. నుమాయిష్ ప్రారంభం వాయిదా..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

హైదరాబాద్‌లో ప్రతి ఏటా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించే అతిపెద్ద ఎగ్జిబిషన్ నుమాయిష్. దేశంలోని అన్ని ప్రాంతాల వ్యాపారులు తమ ప్రాంతానికి చెందిన అద్భుతమైన కళాఖండాలను ఈ ఎగ్జిబిషన్‌కు తీసుకురానున్నారు. ఈ ఎగ్జిబిషన్ సందర్శించేందుకు కేవలం నగర వాసులు మాత్రమే కాదు.. రాష్ట్రంలోని జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు పెద్ద ఎత్తున వస్తుంటారు. అయితే.. ఏటా నుమాయిష్ ఎగ్జిబిషన్ జనవరి 1వ తేదీన ప్రారంభమై 46 రోజుల పాటు కొనసాగుతుంది. అంటే.. ఫిబ్రవరి 15 వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. కానీ.. ఈసారి మాత్రం నుమాయిష్ ప్రారంభం వాయిదా పడింది.హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరగాల్సిన అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) జనవరి 1న ప్రారంభం కావాల్సి ఉండగా.. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణంతో వారం రోజులు సంతాప దినాలుగా ప్రకటించటంతో ఎగ్జిబిషన్‌ను వాయిదా వేశారు. అయితే.. ఈ కార్యక్రమాన్ని రెండు రోజులు ఆలస్యంగా అంటే.. జనవరి 3వ తేదీన ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. జనవరి 3 నుంచి ఫిబ్రవరి 15 వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నుమాయిష్ యథావిధిగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 84వ అల్ ఇండియా ఎగ్జిబిషన్ సొసైటీ.. నుమాయిష్ కోసం అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ నుమాయిన్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది.పారిశ్రామిక ప్రదర్శన నిర్వహణలో ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షులు, మంత్రి శ్రీధర్ బాబు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మోహన్, కోశాధికారి డాక్టర్ ప్రభాశంకర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారులన నుంచి సుమారు 2500 స్టాళ్ల నిర్మాణానికి నిర్వాహకుల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్టు నిర్వాహకులు చెప్తున్నారు. అయితే.. స్టాళ్ల కేటాయింపు పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. అయితే.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంతో సంతాప దినాలుగా వారం రోజులు ప్రకటించటంతో.. నుమాయిష్ ప్రారంభాన్ని కూడా రెండు రోజులు వాయిదా వేసి.. జనవరి 3న ప్రారంభించాలని నిర్వహాకులు నిర్ణయించారు.పారిశ్రామిక ప్రదర్శన నిర్వహణలో ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షులు, మంత్రి శ్రీధర్ బాబు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మోహన్, కోశాధికారి డాక్టర్ ప్రభాశంకర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారులన నుంచి సుమారు 2500 స్టాళ్ల నిర్మాణానికి నిర్వాహకుల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్టు నిర్వాహకులు చెప్తున్నారు. అయితే.. స్టాళ్ల కేటాయింపు పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. అయితే.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంతో సంతాప దినాలుగా వారం రోజులు ప్రకటించటంతో.. నుమాయిష్ ప్రారంభాన్ని కూడా రెండు రోజులు వాయిదా వేసి.. జనవరి 3న ప్రారంభించాలని నిర్వహాకులు నిర్ణయించారు.

# అల్లు అర్జున్ కు కొత్త కష్టం!

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**



పుష్ప 2 సినిమా రోజున సంధ్య థియేటర్లో జరిగిన తొక్కిసలాట ఘటన అల్లు అర్జున్ జీవితాన్ని మార్చేసింది. ప్రస్తుతం అల్లు అర్జున్ ఈ కేసు నుంచి బయటపడడానికి నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకపక్క అల్లు అర్జున్ రెగ్యులర్ బెయిల్ కోసం ప్రయత్నం చేస్తూనే మరోవైపు తెలుగు రాష్ట్రాలలో అల్లు అర్జున్ పైన సంధ్యా థియేటర్లో తొక్కిసలాట ఘటనతో వచ్చిన వ్యతిరేకతను పోగొట్టేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నారు.అల్లు అర్జున్ పై మరో పిడుగు ఇక ఇదే సమయంలో అల్లు అర్జున్ పైన మరొక పిడుగు పడింది. సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనను ప్రజలు వదిలిపెట్టడం లేదు. తాజాగా సంధ్యా థియేటర్ ఘటన పైన సెటైరికల్ సాంగ్ వైరల్ గా మారింది. టికెట్లు మేమే కొనాలి.. చప్పట్లు మేమే కొట్టాలి.. చావులు మేమే చావాలి అంటూ లిరిక్స్ తో వచ్చిన ఒక సాంగ్ సోషల్ మీడియాలో హల్చల్ చేస్తుంది.మేమే సావాలి.. సంపాదన మీదే కావాలి డిసెంబర్ 27వ తేదీన మసాలా బ్యాండ్ అనే యూట్యూబ్ ఛానల్ జానపద శైలిలో సాగే ఒక మ్యూజికల్ వీడియోను విడుదల చేసింది. ఈ పాటలో సావులు మేమే సావాలి.. సంపాదన మీదే కావాలి అంటూ సినీ ఇండస్ట్రీని టార్గెట్ చేశారు. పైసా తోనే ప్రాణం కొంటారా పెద్ద మనుషులు.. మీవల్లే సచ్చిన మనిషిని.. చూడరావు మీ మనసులు అంటూ పాటలో పేర్కొన్నారు.

**అల్లు అర్జున్ టార్గెట్ గా సెటైరికల్ సాంగ్**

ఆ పాటలో అల్లు అర్జున్ పుష్ప సినిమాలోని మేనరిజం చూపిస్తూ చేసిన డాన్స్ చర్చనీయాంశంగా మారింది. అల్లు అర్జున్ పేరు కానీ, పుష్ప ప్రస్తావన కానీ ఎక్కడా పాటలో తీసుకురాకుండా రేవతి మృతి విషయంలో అల్లు అర్జున్ చిత్ర బృందాన్ని టార్గెట్ చేసినట్టుగా ఈ సెటైరికల్ సాంగ్ చేసినట్టు అర్థమవుతుంది. ఇవి మాత్రమే కాదు సెల్ఫీకోసం వస్తే చెంప పగలగొడతారని, కటౌట్లు కట్టి మా ప్రాణాలు పోయాయని పాటలో పేర్కొన్నారు.

సంధ్యా థియేటర్ ఘటనపై సాంగ్ .. భిన్నాభిప్రాయాలుసినిమా వాళ్ళకోసం సామాన్యులు చేస్తున్న త్యాగాలను, వాళ్లను సినిమావాళ్లు ట్రీట్ చేస్తున్న విధానాన్ని ఎత్తిచూపారు. అయితే కొంతమంది ఈ పాటను ఆసక్తిగా చూసి నిజమేనని చర్చించుకుంటే, మరి కొంతమంది రేవతి మరణం ఒక సెన్సిటివ్ ఇష్యూ అని దాని మీద పాటలు చేయడం ఆమోదయోగ్యం కాదని సాంగ్ పైన అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఈ పాట ద్వారా మరోసారి అల్లు అర్జున్ ను టార్గెట్ చేశారు మసాలా బ్యాండ్ నిర్వాహకులు.

# దారుణం.. రాష్ట్రంలో ఒకే రోజు ముగ్గురు పోలీసులు మృతి..!

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**



పోలీసుల ఆత్మహత్యలు ఈ మధ్య విపరీతమయ్యాయి. అప్పుల బాధ తాళలేక కొందరు, అక్రమ సంబంధాలతో ఇంకొందరు, అనారోగ్య సమస్యలతో మరికొందరు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఈ ఆత్మహత్యలు ఎక్కువగా జరిగాయి. ఇటీవల వాజేడు ఎస్సై సురేశ్ తన రివాల్వర్‌తో కాల్చుకుని సూసైడ్ చేసుకున్నాడు.

**ఇద్దరు పోలీసులు ఆత్మహత్య**

అది మరువక ముందే రీసెంట్‌గా కామారెడ్డి జిల్లాలో మరో ఇద్దరు పోలీసులు ఆత్మహత్య చేసుకున్నారు. ఒక ఎస్సై, మహిళా కానిస్టేబుల్ చెరువులో మృతదేహాలుగా తేలారు. అది కూడా మరువకముందే ఇప్పుడు మరో ముగ్గురు పోలీసులు మరణించడం కలకలం రేపింది. ఒకేరోజు ముగ్గురు కానిస్టేబుళ్లు వేర్వేరు ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

**చెట్టుకు ఉరేసుకుని మృతి**

తెలంగాణలోని మెదక్ జిల్లాలో దారుణం జరిగింది. కొల్చారంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని సాయి అనే కానిస్టేబుల్ సూసైడ్ చేసుకున్నాడు. సాయి ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం విచారణ ప్రారంభించారు. దీని తర్వాత తెలంగాణలో మరో ఘటన జరిగింది. సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని కాలకుంట కాలనీలో బాలకృష్ణ అనే ఏఆర్ కానిస్టేబుల్ సూసైడ్ చేసుకున్నాడు.

**గుండెపోటుతో మరొకరు**

భువనగిరికి చెందిన మరో హెడ్ కానిస్టేబుల్ దోసపాటి బాలరాజు గుండెపోటుతో మరణించాడు. శనివారం సాయంత్రం శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది పడ్డాడు. వెంటనే తోటి సిబ్బంది హాస్పిటల్‌కు తరలించే ప్రయత్నం చేశారు. కానీ మార్గ మధ్యంలోనే బాలరాజు మరణించాడు. అతడి మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాలకుంట కాలనీలో బాలకృష్ణ అనే ఏఆర్ కానిస్టేబుల్ సూసైడ్ చేసుకున్నాడు. తన భార్య మానస, ఇద్దరు పిల్లలు యశ్వంత్, ఆశిరిత్‌కు పురుగుల మందు ఇచ్చాడు. అనంతరం తాను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కానిస్టేబుల్ బాలకృష్ణ మరణించగా.. అతడి భార్య, పిల్లలు ఇద్దరూ హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ పొందుతున్నారు. అప్పుల బాధతోనే కానిస్టేబుల్ బాలకృష్ణ ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు చెబుతున్నారు. ఇలా ఒక్కరోజే ముగ్గురు మరణించిన ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి.

# సంక్రాంతికి ప్రయాణికులకు తెలంగాణా ఆర్టీసీ శుభవార్త..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**




సంక్రాంతి పండుగకు తెలంగాణ ఆర్టీసీ ఊరికి వెళ్లే వారికి శుభవార్త చెప్పింది. సంక్రాంతి పండుగ వచ్చిందంటే ప్రతి ఒక్కరూ తమ స్వగ్రామాలకు వెళ్లి పండుగను విశేషంగా జరుపుకుంటారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెద్ద సంఖ్యలో సంక్రాంతి పండుగకు తరలి వెళ్తారు. ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వారు పండుగకు కచ్చితంగా వారి సొంత ఊర్లకు వెళ్లి ఎంజాయ్ చేస్తారు.

సంక్రాంతికి తెలంగాణా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఇక సొంత వాహనాలు ఉన్నవారు మినహాయించి మిగతావారు రైళ్లలోనూ, బస్సులలోను ప్రయాణాలు చేస్తారు, సంక్రాంతి రద్దీ దృష్ట్యా రైల్వే శాఖ మాత్రమే కాదు ఆర్టీసీ కూడా అదనపు ప్రయాణ సౌకర్యాలను కల్పిస్తుంది. సంక్రాంతి రద్దీని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. సంక్రాంతి పండుగకు 5000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

**పదిరోజుల పాటు నడవనున్న ప్రత్యేక బస్సులు**

రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నడిపే సర్వీసులు కూడా వీటిలో ఉంటాయని తెలుస్తుంది. జనవరి మొదటివారం నుంచి పదిరోజుల పాటు ఈ బస్సులు నడుస్తాయని టీజీఎస్ ఆర్టీసీ పేర్కొంది. అయితే సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేకబస్సులు ఏ ఏ రూట్లో నడుస్తాయి అనే అంశంపైన త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అంతే కాదు టికెట్ రేట్లపైన కూడా త్వరలోనే క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

**ప్రైవేట్ వాహనాల బాదుడుకు చెక్ హైదరాబాద్**

నుండి ఏపీకి పెద్ద సంఖ్యలో ప్రయాణికులు తరలి వెళ్లే వేళ పది రోజులపాటు వీరి సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ పేర్కొంది. ఇప్పటికే సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రైవేటు వాహనాలు, ప్రైవేటు బస్సుల వారు సంక్రాంతికి చార్జీల బాదుడుకు సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పిన శుభవార్త ప్రతి ఒక్కరికి సంతోషాన్ని కలిగిస్తుంది.

**పండుగకు తెలంగాణా ఆర్టీసీ ప్లాన్**

ఇక ఈ సంవత్సరం ఐదువేల బస్సులను నడపడం తొలిసారి. ఇంత భారీ సంఖ్యలో ఇంతకుముందు ఎప్పుడు తెలంగాణ ఆర్టీసీ బస్సులను నడపలేదు. ఏపీఎస్ఆర్టీసీకి తెలంగాణ ఆర్టీసీ తీసుకున్న నిర్ణయం పండుగ వేళా కాస్త దెబ్బ అని చెప్పాలి. ఈ ఫెస్టివల్ ను బాగా క్యాష్ చేసుకోవాలని భావిస్తున్న తెలంగాణ ఆర్టీసీ అదనపు చార్జీలు కూడా ఏవి లేకుండా ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం.

**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉంటుందా?**

అయితే ఈ బస్సులకు సంబంధించిన పూర్తి వివరాలను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. త్వరలోనే అధికారికంగా పూర్తి సమాచారాన్ని ఇవ్వవలసి ఉంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు పండుగ వేళ కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వర్తిస్తుంది. పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో, ఎక్స్ప్రెస్ బస్సులలో వీరు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.

**పండుగ వేళ మహిళల ప్రయాణం ఇలా**

తెలంగాణకు సంబంధించిన వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లాలనుకుంటే మాత్రం తెలంగాణ సరిహద్దుల వరకు ఉచిత ప్రయాణాన్ని ఏపీలోకి వెళ్లిన దగ్గర నుండి టికెట్ తీసుకుని ప్రయాణాన్ని చేయాల్సి ఉంటుంది. ఏది ఏమైనా ఇది సంక్రాంతి పండుగకు వెళ్లే ప్రయాణికులకు సూపర్ న్యూస్.



# కన్హా శాంతివనాన్ని సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతోన్న విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సాఫ్ట్ స్కిల్స్ నేర్పించే దిశగా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని కన్హా గ్రామంలోని కన్హా శాంతివనాన్ని సందర్శించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా అక్కడ చిన్నారులు, విద్యార్థులకు నేర్పించే సాఫ్ట్ స్కిల్స్ కు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కళ్లకు గంతలు కట్టుకుని రంగులను గుర్తించడం, పదాలను చదవడం వంటి స్కిల్‌స్‌ను ప్రదర్శించిన అక్కడి విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు.

కన్హా శాంతి వనం నిర్వాహకులు, శ్రీ రామ్ చంద్ర మిషన్ అధ్యక్షులు, హార్ట్ ఫుల్ నెస్ గ్లోబల్ గైడ్, ఆధ్యాత్మికవేత్త గౌరవ కమలేష్ పటేల్ (దాజీ) స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వాగతం పలికారు. వనమంతా తిప్పి చూపించారు. కన్హా శాంతివనం ఆవరణలోని ట్రీ కన్జర్వేషన్ సెంటర్ లో వివిధ రకాల వంగడాల అభివృద్ధి, మొక్కల పెంపకానికి సంబంధించిన విధానాలను శాంతి వనం నిర్వాహకులు సీఎంకు వివరించారు.

శాంతి వనంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెయిన్ ఫారెస్ట్ ను, మెడిటేషన్ సెంటర్ హాలును సందర్శించిన సీఎం రేవంత్ అక్కడ ఒక మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, కాలే యాదయ్య, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఘాటు తగ్గుతున్న మిర్చి!

- భారీగా పడిపోతున్న మిర్చి ధర
- గత సీజన్‌తో పోల్చితే రూ.10 వేలు తగ్గుదల
- కొత్త పంట రాకతో పాత మిర్చికి తగ్గిన డిమాండ్

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

నాణ్యత లేమితో పడిపోయిన ఎగుమతులు ఖమ్మం వ్యవసాయం: మిర్చి ధర గణనీయంగా పతనమవుతోంది. రెండు, మూడు రోజులుగా ధర బాగా పడిపోయింది. గత ఏడాది పంట సీజన్‌లో గరిష్టంగా క్వింటాలుకు రూ.22,300 పలికిన మి ర్చి.. ప్రస్తుతం రూ.16 వేలకు దిగజారింది. మోడల్ ధర రూ.19 వేల నుంచి ఉండగా.. ప్రస్తుతం రూ.12 వేల నుంచి రూ.13 వేలకు మించి పలకడం లేదు. పంట సీజన్‌తో ధరతో పోలిస్తే ప్రస్తుతం దాదాపు రూ.10 వేల మేర ధర పడిపోయింది. ప్రస్తుతం గరిష్ట ధరలు రూ.16,700 నుంచి రూ.16 వేలు గా, మోడల్ ధర రూ.15 వేలు మొదలు రూ.13 వేల వరకు పలుకుతున్నాయి. దీంతో అధిక ధరలు ఆశించి మిర్చిని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకొన్న వ్యాపారులు, రైతులు లబోదిబోమంటున్నారు.



# ముమ్మరంగా కొనసాగుతున్న రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండల పరిధిలోని జగత్ పల్లి శివారులో ప్రధాన రహదారిపై ప్యాచ్ వర్క్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పెద్దమందడి మండల కేంద్రం నుంచి వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లే రహదారిలో జగత్ పల్లి నుంచి రాజనగరం రామకృష్ణేశ్వర దేవాలయం వరకు గత కొన్ని రోజులుగా రోడ్డు గుంతలు ఏర్పడి ప్రయాణికులకు అసౌకర్యం ఏర్పడింది. దీంతో జగత్ పల్లి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి కాంట్రాక్టు పని దక్కించుకొని సుమారు పది లక్షల వ్యయంతో రోడ్డు పనులను ప్రారంభించారు. ఎన్నో రోజులుగా గుంతల రోడ్డుతో ఇబ్బందులు పడ్డ ప్రయాణికులకు తాత్కాలిక ప్యాచ్ రోడ్డు పనులతో ఉపశమనం కలగనుందని మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి

- పలు అభివృద్ధి పనులు, శంకుస్థాపనల పై ప్రత్యేక చర్చ
- పాల్గొన్న పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభాలు, శంకుస్థాపనలపై త్వరలోనే వనపర్తికి రానున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారితో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి గారు ఆదివారం భేటీ అయ్యారు.ఈ సందర్భంగా వారు నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు సంబంధించిన అంశాలతో పాటు, విద్య వైద్యం వ్యవసాయం సాగునీరు లాంటి తదితల అంశాలపై కీలకంగా చర్చించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ ప్రత్యేక భేటిలో నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి పాల్గొని పార్లమెంటు పరిధిలో నిర్వహించనున్న ఉద్యోగ మేళా, రుణమేళకు సంబంధించిన అంశాలపై చర్చించారని ఎమ్మెల్యే తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వనపర్తి నియోజకవర్గానికి వచ్చే తేదీని త్వరలోనే ప్రకటించనున్నామని ఎమ్మెల్యే చెప్పారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులకు జైలు శిక్ష

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులకు ఖమ్మం స్పెషల్ జ్యుడీషయల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి మూడు రోజులు శిక్ష విధించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు ఆకస్మికంగా రోడ్లపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తూ....మద్యం మత్తులో పట్టుబడిన వారిపై న్యాయస్థానాల్లో ఛార్జ్‌షీట్‌లు దాఖలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల మద్యం సేవిస్తూ తనిఖీల్లో పట్టుబడిన నగరానికి చెందిన ఆటో డ్రైవర్ కు మూడు రోజులు శిక్ష విధించడంతో పాటు మరికొందరి రెండు వేల నుండి మూడు వేల వరకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఇటీవల రోడ్డు ప్రమాదాల సంఖ్య భారీగా పెరుగుతోందని, ఒక్కరి అజాగ్రత్త ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదం నింపుతోందని అన్నారు. కొన్నిసార్లు మనం కరెక్టుగానే వెళ్తున్నా, అవతలి వారి నిర్లక్ష్యం మన ప్రాణాలను హరిస్తోందని, అయితే ఎక్కువ కేసుల్లో ప్రమాదాలకు మద్యం మత్తే కారణం అవుతున్నాయని అన్నారు. మందేసి రోడ్లపైకి వస్తున్న కొందరు వాహనదారులు, ఇతరుల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని అన్నారు. ఈ క్రమంలోనే రోడ్డు ప్రమాద నివారణే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు.



# పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్ వైస్ చైర్మన్ ని కలిసిన ప్రముఖులు

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం నగరం కోణార్క్ హోటల్ లో పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్ జాతీయ కమిటీ అత్యవసర సమావేశం జరిగింది. పుడమి సాహితీ వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో పుడమి రత్న జాతీయ విశిష్ట సేవ పురస్కారం అవార్డు కి "పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్" వైస్ చైర్మన్ వర.రాజశేఖర్ ఎంపిక అయ్యారు . ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు . ఈ కార్యక్రమంలో జాతీయ చైర్మన్ దగ్గుపాటి మాధవరావు , జాతీయ కోఆర్డనేటర్ అద్దంకి శివ ప్రసాద్ , జాతీయ జాయింట్ సెక్రటరీ ఎన్ బ్రహ్మం , తెలంగాణ కోఆర్డనేటర్ అబ్దుల్ రెహమాన్ , మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ ఎం.కనక దుర్గ , శ్రీనివాస్ రావు , మహిళా ఉద్యమ నాయకురాలు మామిడాల ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు .

# 1997–98 బ్యాచ్ శాంతినికేతన్ హైస్కూల్ విద్యార్థుల అ'పూర్వ' కలయిక

- సందడిగా శాంతినికేతన్ హైస్కూల్ రీయూనియన్
- 1997-98 బ్యాచ్ శాంతినికేతన్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల కలయిక

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**



హన్మకొండ సుబేదారిలోని పాలమూరు గ్రిల్ రెస్టారెంట్‌లో ఆదివారం 199-798 బ్యాచ్ శాంతినికేతన్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల పునఃకలయిక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు వి. సంపత్ కుమారాచార్య, జగన్మోహన్ తదితరులు హాజరయ్యారు. 27 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకే వేదికపై కలుసుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి నాటి పాఠశాల జ్ఞాపకాలను పంచుకున్నారు. ప్రారంభంలో మిత్రులను కోల్పోయిన సందర్భంగా మౌనం పాటించి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు జగన్మోహన్ మాట్లాడుతూ, "విద్యానికేతన్ విద్యార్థుల క్రమశిక్షణ ఈ అపూర్వ కలయికకు నాంది పలికింది" అని పేర్కొన్నారు.ఈ రీయూనియన్‌లో పూర్వ విద్యార్థులు తమ జీవిత గమ్యాల గురించి పంచుకుంటూ, దేశవిదేశాల నుండి వచ్చి తమ మిత్రులను కలుసుకోవడం సంతోషకరమని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకరికొకరు గౌరవం తెలియజేస్తూ, పాఠశాల రోజుల జ్ఞాపకాలను మళ్లీ ఒక్కసారిగా జీవింపజేశారు.సమావేశం ముగింపులో ఆత్మీయ మిత్రత్వాన్ని కొనసాగిస్తూ, తమ పాఠశాల విలువలను భవిష్యత్ తరాలకు ఆవిష్కరించేలా శ్రమిస్తామని పునరుద్ఘాటించారు. ఈ రీయూనియన్ పూర్వ విద్యార్థుల జీవితాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.



# వ్యవసాయ కూలీలకు బేషరతుగా 12000 రూపాయలు ప్రభుత్వం అందజేయాలి

- మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఖాజా హుస్సేన్

**వనపర్తి , తెలంగాణ ముచ్చట్లు:**

రెక్కల కష్టమే ఆస్తిగా చెమట చుక్కలే పెట్టుబడిగా భూమిపై వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తామన్న సంవత్సరానికి 12 వేల రూపాయల పథకమును ఏలాంటి షరతులు లేకుండా భేషరతుగా అమలు చేయాలని మాజీ వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఖాజా హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు వ్యవసాయ కూలీలందరికీ సంవత్సరానికి 12 వేల రూపాయలు అందజేస్తామని వాగ్దానం చేసింది కానీ అమలు చేయడంలో సంవత్సరం గడుస్తున్న ఇంకా అనేక కొర్రీలు పెట్టి రెండు దఫాలంటూ మొదటి దఫా 6000 రెండో దఫా 6000 ఇస్తామని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ప్రకటన చేశారు. మరల ఇప్పుడు జాబ్ కార్డు ఉన్నవారు వంద రోజులు పని చేస్తేనే అర్హులంటూ, కుంట. రెండు గుంటలు ఉన్న చిన్న రైతులకు రైతు భరోసా ఏమి రాదు యంత్రాలు వచ్చి వ్యవసాయ కూలీల పనులు తగ్గిపోతున్నాయి కేంద్ర ప్రభుత్వం అనేక షరతులతో మహాత్మా గాంధీ ఉపాధి గ్రామీణ పథకాన్ని పనులను తగ్గించుకుంటూ షరతులు పెట్టుకుంటూ కేంద్ర బడ్జెట్ లో నిధులను తగ్గించుకుంటూ వస్తుంది గ్రామీణ ప్రాంతంలో సంపూర్ణంగా పనిని కల్పించడం లేదు. పట్టణ ప్రాంతాలకు ఈ పనిని అనుమతి ఇవ్వటం లేదు ఫీల్డ్ అసిస్టెంట్లతోటి సర్వేలు చేయించి కూలీల వడపోత కార్యక్రమాన్ని ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ తప్పుడు విధానాలను వ్యవసాయ కార్మిక సంఘం ఖండిస్తుంది రాష్ట్ర ప్రభుత్వం ఏదైతే వాగ్దానం చేసిందో వ్యవసాయ కార్మికులందరికీ సంవత్సరానికి 12,000 రూపాయలు అధికారంలోకి రాగానే అందజేస్తామని చెప్పారు. అందజేస్తామని చెప్పి నేడు కూలీలకు అనేక షరతులు విధిస్తున్నారు. ఈ విధానం సరి అయినది కాదని వ్యవసాయ కూలీలందరికీ ప్రభుత్వ పథకం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం వందరోజుల పని ప్రకటించినప్పటికీ ఆచరణలో గ్రామాలలో 50. 60 రోజుల కన్నా ఎక్కువ జరగటం లేదు. అది కూడా వ్యవసాయ కూలీలు డివైడ్ చేసి పని కల్పించాలని కోరుతూ అప్పుడు పనికిటాయిస్తున్నారు ఫీల్డ్ అసిస్టెంట్లు ఇచ్చిన ఆధారంగా కాకుండా ప్రతి ఒక్కరికి వ్యవసాయ కార్మికులకు పథకం వర్తింపజేయాలని ప్రభుత్వం చేసిన వాగ్దానం సంపూర్ణంగా చేయాలని లేనిపక్షంలో కార్మికులు చేసే పోరాటానికి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ప్రభుత్వం బాధ్యత వహించవలసి వస్తుంది అని అన్నారు . కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఖాజా హుస్సేన్. బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు సతీష్ శర్మ. సేవియా నాయక్ . వెల్టూరు బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం జిల్లా యాదవులకు రాష్ట్ర,జిల్లా రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

- అఖిల భారత యాదవ మహాసభ రౌండ్ టేబుల్ సమావేశంలో పలువక్తల డిమాండ్.

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం జిల్లా యాదవులకు రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవులు కల్పించాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రాధాన్యత కల్పించాలని, గొర్రెల పెంపకం దారులకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను వెంటనే అమలు చేయాలని,ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ నాయకులు అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారి సింహాద్రి యాదవ్, రాష్ట్ర కార్యదర్శి లోదిగ వెంకన్న యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం రామకృష్ణ ఫంక్షన్ హాల్ ఖమ్మంలో అఖిలభారత యాదవ మహాసభ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వక్తలు ప్రసంగిస్తూ బీసీలలో అధిక జనాభా కలిగి, రాజకీయ చైతన్యం కలిగి ఉన్న యాదవులకు రాష్ట్రస్థాయిలో రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడం దురదృష్టకరమని, వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ప్రచారాలకు ఉపయోగించుకొని, యాదవులకు ఎన్నో వాగ్దానాలు చేయడం జరిగిందని, ప్రభుత్వం ఏర్పాటు ఒక ఏడాది అయినప్పటికీ, ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, మాట తప్పి, అవసరం తీరాక తెప్ప తగలేసినట్లుగా చేస్తే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించి, రాబోయే ఎన్నికలలో తగిన బుద్ధి చెబుతామని, హెచ్చరించారు. రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవులు కల్పించాలని, జిల్లాలో రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను వెంటనే అమలు చేయాలని, గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గొర్రెల సంఘాలకు జారీy చేసిన జీవోలను అమలు చేయాలని, జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుబాకుల శ్రీనివాస్, దుబాకుల వెంకటేశ్వర్లు, గూదే భద్రయ్య, చేతుల నాగేశ్వరరావు బొల్లి కొమరయ్య మొరిమేకల కోటయ్య, బండారి ప్రభాకర్,పొదిలి సతీష్, తెల్లబోయిన రమణ, లింగరాజు, భారీ విజయ్, బమ్మిడి శ్రీనివాస్, సోమన బోయిన లింగయ్య రాగం మల్లేష్ తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు



# నీట్ పీజీలో రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించిన పోరిక శ్రీరామ్

**ములుగు,తెలంగాణ ముచ్చట్లు:**

ములుగు జిల్లా మల్లేపల్లి గ్రామానికి చెందిన పోరిక శ్రీరామ్ ఇటీవల నిర్వహించిన నీట్ పీజీ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు మరియు దేశవ్యాప్తంగా 52వ ర్యాంకు సాధించి గాంధీ మెడికల్ కాలేజ్, హైదరాబాద్‌లో జనరల్ మెడిసిన్‌లో ప్రవేశం పొందాడు. సాధారణ రైతు పోరిక తులసీరామ్, అరుణ దంపతుల కుమారుడైన శ్రీరామ్ చిన్నప్పటి నుంచి తెలివైన విద్యార్థిగా ప్రశంసలు పొందాడు. హన్మకొండ ఆర్డీ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్మీడియట్ చదువుతూ రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించిన శ్రీరామ్, డాక్టర్ కావాలని సంకల్పించి, పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో నిరంతరం శ్రమించాడు. ఆ పట్టుదల ఫలితంగా ఈ రోజు మల్లేపల్లి గ్రామానికి గర్వకారణంగా నిలిచాడు.పోరిక కుటుంబం మొత్తం గ్రామానికి ఆదర్శంగా నిలుస్తోంది. బలరాం, తులసీరామ్, రాజు అనే ముగ్గురు అన్నదమ్ముల కుటుంబంలో ప్రతి ఒక్కరూ తమ రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. బలరాం కుమారుడు విటల్ కుమార్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ మేనేజర్‌గా సేవలందిస్తుండగా, తులసీరామ్ కుమారుడు శ్రీరామ్ డాక్టర్ అవ్వగా, రాజు కుమారుడు సిద్ధార్థ ఐఐటీ ఇండోర్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చేస్తూ ముందుకు సాగుతున్నాడు.తన విజయానికి కారణమైన తల్లిదండ్రుల సంపూర్ణ మద్దతు, పట్టుదల, గ్రామస్తుల ప్రేమను గుర్తు చేసుకున్న శ్రీరామ్, భవిష్యత్తులో తన సేవలతో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తానని అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అతనిపై గర్వంతో పొంగిపోయారు.శ్రీరామ్ విజయాన్ని పురస్కరించుకొని మల్లేపల్లి గ్రామంలో లంబాడి ఐక్య వేదిక ఆధ్వర్యంలో శ్రీరామ్‌కు ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో లౌడియా పల్లవి, రాజు నాయక్, రాము నాయక్, శారద, హేమ నాయక్, శంకర్ రజిత, జాటర్ శ్రీను, వాంకుడోత్ విజయ్, తదితరులు పాల్గొని శ్రీరామ్‌ను అభినందించారు.




# రక్తదానం ప్రాణదానంతో సమానం

- గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్,పిఏసిఎస్ చైర్మన్

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**

రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారికి అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావాల్సిన వారిని కాపాడేందుకు ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని డీసీసీబీ డైరెక్టర్,ధర్మసాగర్ మండల ప్రాధమిక వ్యవసాయ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. జనవరి 1న తన పుట్టినరోజు సందర్భంగా ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుష్మిత గార్డెన్‌లో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజేశ్వర్ రెడ్డి రక్తదాతలకు సర్టిఫికేట్‌లు, పండ్లు, రసాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "అన్ని దానాల్లోకీ రక్తదానం అత్యంత గొప్పదని, ఇది ప్రాణాలకు ప్రాణం పోసే సేవ" అని అన్నారు. ప్రతి రక్తదానం ఒక ప్రాణాన్ని రక్షించే సాధనమని, రక్తదాతలు ప్రాణాదాతలుగా నిలుస్తున్నారని ఆయన ప్రశంసించారు. రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన సుమారు 100 మంది రక్తదాతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ శిబిరాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులకు, సహకారం అందించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. "నా పుట్టినరోజు ఈ విధంగా సార్థకమవ్వడం ఎంతో ఆనందంగా ఉంది" అని రాజేశ్వర్ రెడ్డి అన్నారు.ఈ మెగా రక్తదాన శిబిరం ధర్మసాగర్ మండలంలో రక్తదానం పై అవగాహన పెంచడం మాత్రమే కాక, ఈ ఆచరణ ద్వారా మరెన్నో ప్రాణాలను రక్షించేందుకు ప్రేరణగా నిలిచింది.



# భవిష్యత్తంత సోషలిజానిదే..



- మోదీ విధానాలను తరిమికొట్టిన చరిత్ర రైతాంగ పోరాటానిదే..
- ప్రపంచంలో ఎవరికీ తలొగ్గని 'సంసాంగ్' కంపెనీ మెడలొంచిన ఎర్రజెండా
- మోదీ పాలనలో ఆర్థిక అసమానతలు
- మనువాద దృక్పథంతో దేశాన్ని పాలించాలని బీజేపీ కుట్రలు
- కేసీఆర్ బాటలోనే రేవంత్ నడక
- ఎన్నికల వాగ్దానాల అమలులో కాంగ్రెస్ విఫలం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్

**ఇబ్రహీంపట్నం,తెలంగాణ ముచ్చట్లు**

దోపిడీకి గురవుతున్న కార్మిక, కర్షకులకు, వలసవాదంతో అసమానతలకు గురవుతున్న అణగారిన వర్గాలకు అండగా ఎర్రజెండా నిలుస్తోందని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు ఒక భాగమైతే, ప్రజా సమస్యల పరిష్కారానికి పని చేస్తున్నది కమ్యూనిస్టులేనన్నారు. రంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) 10వ జిల్లా మహాసభ ఇబ్రహీంపట్నంలోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో రెండో రోజు కొనసాగింది. మహాసభల ప్రారంభం సందర్భంగా రెండవ రోజు సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపానికి జోహార్లు అర్పిస్తూ పార్టీ నాయకులు, కా ర్యకర్తలు అమరులను స్మరించుకున్నారు. అనంతరం ప్రారంభమైన ప్రతినిధుల సభలో పోతినేని ప్రారంభోపాన్యాసం చేశారు. ప్రపంచ పెట్టుబడి దేశాల్లో ప్రస్తుతం ఆర్థిక అసమానతలు నెలకొన్నాయన్నారు. సామ్రాజ్యవాద దేశాల్లో అణిచివేతకు గురవుతున్న ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నారన్నారు. శ్రీలంకలో జరిగిన అధ్యక్ష, పార్లమెంట్ ఎన్నికల్లోనూ కమ్యూనిస్టులకే అధికారం అప్పగించారని గుర్తు చేశారు. దేశంలో రెండంకెల అభివృద్ధి జరుగుతుందని మోడీ చేస్తున్న వ్యాఖ్యలు అనాలోచితమన్నారు. దేశ ఆర్థిక వృద్ధి 5.4 శాతానికి పడిపోయిందన్నారు. రూపాయి విలువ డాలర్తో పోల్చితే 2014లో 59 రూపాయలు ఉండగా, ప్రస్తుతం రూ.86కు చేరిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం 9 శాతం, పట్టణ ప్రాంతాల్లో 8.3శాతం పెరిగిందన్నారు. వీటి నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకు మోడీ వికృత విధానాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ను ఉద్దేశించి అమిత్ చేసిన వ్యాఖ్యలు దేశ ప్రజానీకాన్ని అవమానించినట్టేనన్నారు. దీన్ని తప్పు పట్టాల్సిన ప్రధాని బలపర్చడం సిగ్గు చేటని విమర్శించారు. మనువాద దృక్పథంతో దేశాన్ని పాలించే దిశగా బీజేపీ కుట్రలు చేస్తోందన్నారు. తమిళనాడులో సంసాంగ్ కంపెనీలో కార్మిక సంఘం పెట్టుకునేందుకు వ్యతిరేకించిన ఆ సంస్థ యాజమాన్య మెడలు వంచి ఆ యజమానులతో కార్మికుల జెండా ఎగరేయించిన ఘనత ఎర్రజెండాదే అన్నారు. రైతాంగ వ్యతిరేక విధానాలను తేవాలని చూసిన మోడీ ప్రభుత్వాన్ని వెనక్కి కొట్టిన ఘనత కూడా కమ్యూనిస్టులదేనన్నారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేసీఆర్ ఇడ్చిన చెప్పులోనే రేవంత్రెడ్డి ప్రభుత్వం నడుస్తున్నదని పోతినేని విమర్శించారు. రైతు రుణమాఫీ విషయంలో రూ.2లక్షల లోపు పూర్తి స్థాయిలో మాఫీ చేసినట్టు చెబుతున్నా. క్షేత్రస్థాయిలో మాఫీ కాలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో చేపడుతున్న ప్రక్రియను కాంగ్రెస్ కార్యర్తలతో చేయించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇందిరమ్మ కమిటీల్లో అన్నీ సామాజిక వర్గాలకు స్థానం కల్పించి, పారదర్శకతను పాటించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వాగ్దానాలు అమలు చేయించే విధంగా ఎర్రజెండా నాయకత్వంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. జనవరి 2025లో సంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర సీపీఐ(ఎం) నాల్గవ మహాసభల్లో ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ, డీజీ నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామేల్, పి.యాదయ్య, జగదీష్, మధుసూదన్ రెడ్డి, కవిత, చంద్రమోహన్, శోభన్, జిల్లా కమిటీ సభ్యులు రాంచందర్, జగన్ తదితరులున్నారు.

## ప్రేమ గురించి తప్ప ఇతర పాటలు
# సినిమాల్లో ఉండట్లేదు

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**



ప్రేమ గురించి తప్ప ఇతర ఏ పాటలు ప్రస్తుత చిత్రాల్లో ఉండట్లేదని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. సినిమా పాటల విషయంలో పోకడ మారాల్సిన అవసరం ఉందని ఆయన తన అభిప్రాయాన్ని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడలో జరిగిన 6వ ప్రపంచ తెలుగు మహాసభల్లో అనంత శ్రీరామ్ పాల్గొని మాట్లాడారు. సినిమాల కోసం కాకుండా అప్పుడప్పుడు తన సంతృప్తి కోసం కొన్ని పాటలు రాసుకుంటానని ఆయన వెల్లడించారు.

**పెద్ద సినిమాలైతే కండిషన్స్?**

సినిమా పాటలు రాస్తున్నప్పుడు ఎక్కడో ఒక చోట అసంతృప్తి ఉంటుందని అనంత శ్రీరామ్ అన్నారు. అది పెద్ద సినిమా అయితే హీరో పరిచయ గీతం, హీరోయిన్ హీరోను చూసినప్పుడు వచ్చే ఓ ప్రేమ పాట, హీరో హీరోయిన్కి ప్రేమ కుదిరినప్పుడు వచ్చే ఒక యుగళగీతం, రెండో అర్ధ భాగంలో హీరో పోరాటానికి వెళ్తున్నప్పుడు నువ్వు సింహం, పులి అని పొగిడే పాట, ఆ తర్వాత సినిమాకి ఒక ఆట విడుపు ఇవ్వాలి కాబట్టి, ఐటమ్ సాంగ్ ఆఖర్లో అంతా సంతోషం వైపు పయనిస్తున్నామని హీరో, హీరోయిన్లు నిర్ణయించుకుంటున్నప్పుడు వచ్చే ఉత్సాహభరితమైన పాటతో రాయాల్సివస్తుందని అనంత శ్రీరామ్ అసహనం వ్యక్తం చేశారు.

**సంక్రాంతికి వస్తున్నాం :**

ఈ సూత్రంతోనే పెద్ద సినిమాలు నడుస్తున్నాయని, చిన్న సినిమాలైతే ప్రేమ పుట్టినప్పుడు, వికసించినప్పుడు, ప్రేమ భగ్నమైనప్పుడు, మళ్లీ కలుసుకున్నప్పుడు వచ్చే పాటలు తప్పితే ఇంతకు మించిన సన్నివేశాల సృష్టి జరగట్లేదని శ్రీరామ్ అన్నారు. అదృష్టవశాత్తు ఈ సంక్రాంతికి విడుదలవుతున్న అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన 'సంక్రాంతికి వస్తున్నాం' అనే సినిమాలో గురువుపై అద్భుతమైన పాట రాసే అవకాశం లభించిందన్నారు. త్వరలో మీరు కూడా ఆ పాటను వింటారని అనంత శ్రీరామ్ తెలిపారు.

సముద్రంపై పాట : అంతర్వేది వద్ద గోదావరి సముద్రంలో కలుస్తున్నప్పుడు, కృష్ణానది హంసలదీవి వద్ద సముద్రంలో కలిసే ప్రాంతాన్ని చూస్తే T ఆకారంలో కనిపిస్తుందని, ఆ అద్భుత దృశ్యాన్ని చూసినప్పుడు పాట రాయాలనిపించి "ఎన్ని నదులు కలిస్తే ఎన్నెన్ని నదులు కలిస్తే ఏ లాభం. కడలిలో ఉప్పదనం కాస్త కూడా తగ్గనప్పుడు. ఎన్ని నదులు కలిస్తే ఏం లాభం. ఎన్నెన్ని గుడులు వెలిస్తే ఏ లాభం" అంటూ తాను రాసినట్లు ఆ పాటను సభలో ఉన్నవారికి శ్రీరామ్ వినిపించారు. ఆయన ఆలపించిన గేయాలను సభికులను అలరించడంతో పాటు ఆలోచించే పరిస్థితి వైపు మళ్లించాయి.

# సింగరేణి బొగ్గు 'ప్రియం'

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**



ఇతర పరిశ్రమలతో పోల్చిచూస్తే సింగరేణిలో బొగ్గు వెలికితీతకు అయ్యే ఖర్చు అధికం. ఈ కారణంతో ఉత్పత్తి ధర కూడా ఎక్కువే. వెస్ట్రన్, మహానది కోల్ఫీల్డ్స్ సంస్థలతో పోల్చిచూస్తే సింగరేణి బొగ్గు ధర దాదాపు రెండు రెట్లు అధికం. పెరుగుతున్న ప్రైవేటు సంస్థల పోటీ నేపథ్యంలో.. సింగరేణి తన మనుగడ కోసం ఉత్పత్తి వ్యయం తగ్గింపుపై దృష్టిసారించక తప్పని పరిస్థితి నెలకొంది. ఇటీవల మల్టీడిపార్ట్మెంట్ సమావేశాల్లో, తాజాగా జరిగిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలోనూ దిద్దుబాటు చర్యలపై యాజమాన్యం సమాలోచనలు జరిపింది. వచ్చే ఉత్పత్తి సంవత్సరంలోగా మార్పు దిశగా చర్యలు చేపడుతోంది.

**ఉత్పత్తి అధిక వ్యయానికి కారణాలివే..**

దేశంలోని ఇతర కంపెనీల్లో బొగ్గు ఉత్పత్తి వ్యయం సింగరేణికన్నా తక్కువగా ఉంటోంది. దీనికి కారణం.. అక్కడ ఒక టన్ను బొగ్గును వెలికితీసేందుకు నాలుగైదు టన్నుల మట్టిని తొలగిస్తే సరిపోతుంది. కానీ, సింగరేణిలో ఒక టన్నుకు కనీసం ఏడు టన్నులకు పైగా మట్టిని తొలగించాల్సి వస్తోంది. దీంతో వ్యయం అధికమవుతోంది. దీంతోపాటు యంత్రాల వినియోగ సామర్థ్యం తీసికట్టుగా ఉంది. ఒక్కో యంత్రంతో సగటున రోజుకు 18 గంటల పాటు ఉత్పత్తి చేపట్టే వీలుంది. కానీ, కేవలం 7 గంటల 24 నిమిషాలు మాత్రమే వినియోగిస్తున్నారు. ఇతర కంపెనీల్లో ఈ పని గంటలు అధికంగా నమోదవుతున్నాయి. అధిక ధరను భరించైనా సింగరేణి బొగ్గునే పరిశ్రమలు కొనేందుకు ఓ కారణం ఉంది. అదే.. రవాణా వ్యయం. వెస్ట్రన్, మహానది కోల్ఫీల్డ్స్ బొగ్గు ధర తక్కువ అయినా, రవాణా ఛార్జీలు కలుపుకొంటే సింగరేణి ఉత్పత్తే కాస్త చౌకగా ఉంటోంది. అందుకే, ఇక్కడి విద్యుత్తు ఉత్పత్తి కంపెనీలు అనివార్యంగా సింగరేణిపై ఆధారపడుతున్నాయి. భవిష్యత్తులో పోటీ ఉన్నందున ఉత్పత్తి వ్యయాన్ని వీలైనంత తగ్గించుకోవాలని సింగరేణి యాజమాన్యం భావిస్తోంది. వరుస సమీక్షలు నిర్వహిస్తోంది.

చేపట్టాల్సిన చర్యలివీ..టన్ను బొగ్గు ఉత్పత్తికి 7 టన్నుల మట్టి తొలగించడం అనివార్యం. దీనికి ప్రత్యామ్నాయం లేదు. యంత్రాలు, మానవ వనరుల పని సామర్థ్యాన్ని పెంచుకోవడమే సింగరేణి ముందున్న ఏకైక మార్గం. ప్రస్తుతం గనుల్లోని షావెళ్ల పనితీరు బాగానే ఉన్నా, మిగతా యంత్రాలపై దృష్టిపెట్టాలి. ఉపరితల గనుల్లో 48 డ్రిల్ యంత్రాలున్నాయి. ప్రస్తుతం వీటిని 5.8 గంటలు మాత్రమే వినియోగిస్తున్నారు. మిగతా సమయంలో వృథాగా ఉండకుండా.. గరిష్ఠంగా రోజుకు 19.4 గంటలు ఉపయోగించేందుకు చర్యలు చేపట్టాలి. అవసరం మేర కొత్త యంత్రాలు కొనుగోలు చేయాలి. తద్వారా అదనంగా బొగ్గు ఉత్పత్తి అవుతుంది. 'సింగరేణిలో మొత్తంగా 828 యంత్రాలు పనిచేస్తుండగా.. వాటి సగటు వినియోగాన్ని వచ్చే ఉత్పత్తి సంవత్సరం కల్లా కనీసం నాలుగు గంటలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇలాచేస్తే మరో 20 లక్షల క్యూబిక్ మీటర్ల బొగ్గు అదనంగా ఉత్పత్తి అవుతుంది. ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు బొగ్గు ఇవ్వగలుగుతాం''.




## ఘనంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి
# గోశాల 14వ వార్షికోత్సవ వేడుకలు


- అయోధ్య రామ మందిర్ ట్రస్ట్ కోశాధికారి గోవింద దేవ్ గిరిజి మహారాజ్
- పాల్గొన్న మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**పటాన్ చెరు,తెలంగాణ ముచ్చట్లు**

గోమాతను రక్షిస్తే ప్రపంచ శాంతి లభిస్తుందని అయోధ్య రామ మందిర్ ట్రస్ట్ కోశాధికారి గోవింద దేవ్ గిరిజి మహారాజ్ పేర్కొన్నారు. ఆదివారం అమీన్ పూర్ పట్టణంలోని బీరంగూడలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి గోశాల 14వ వార్షికోత్సవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గోమాత పూజ, శాంతి హోమం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అయోధ్య రామ మందిర్ ట్రస్ట్ కోశాధికారి గోవిందా దేవగిరి జి మహారాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన భారత దేశంలో గోవుకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చేవారన్నారు. మారుతున్న కాలంలో గో సంపద రోజురోజుకీ తగ్గిపోతుందన్నారు. ప్రతి ఒక్కరూ సంపదను రక్షించేందుకు ముందుకు రావాలన్నారు. పురాణ కథనాల్లో దిలీపుడనే మహారాజు గోవు కోసం తన ప్రాణాలను ఇచ్చేందుకు ముందుకు వచ్చారని గుర్తు చేశారు. గోవును రక్షిస్తే ప్రపంచమంతా సుభిక్షంగా ఉంటుందన్నారు. బీరంగూడలో గో సంరక్షణ చేస్తున్న ప్రతినిధులను ప్రత్యేకంగా ఆయన అభినందించారు. మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు మాట్లాడుతూ ప్రాంతీయ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరు గో సేవ చేయాలన్నారు. బీరంగూడ గోశాలలో సుమారు 1200 ఆవులను సంరక్షించడం అభినందనీయమన్నారు. గోశాల నిర్వహణకు అందరూ సహకరించాలనీ కోరారు. ప్రతి ఒక్కరూ అనవసరమైన ఖర్చులను తగ్గించి గో సంరక్షణకు ఆ డబ్బులను అందించాలన్నారు. గోశాలకు సేవ చేసేందుకు తన వంతు సహాయంగా ఎప్పుడూ అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఆదెల్లి రవీందర్, ఎడ్ల రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు ఈర్ల రాజు, నాయకులు రఘునాథ్ రెడ్డి, మాణిక్ యాదవ్, ఆగారెడ్డి, గోశాల చైర్మన్ సోహన్ లాల్ ధైయిమా, అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి విఠల్, ఉపాధ్యక్షులు సుగుదేవ్ జోషి పురుషోత్తం, కోశాధికారి రాజేందర్ తివారి, సభ్యులు భూపాల్ రెడ్డి లక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డి, జయ కృష్ణారెడ్డి కోమలి సందీప్ కొటారి, రాజస్థానీ గేర్ మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రష్యా దాడితోనే విమాన ప్రమాదం

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**



అజర్ బైజాన్ కు చెందిన విమానంపై రష్యా దాడి చేసిందని ఆ దేశాధ్యక్షుడు ఇల్హామ్ అలియవ్ ఆదివారం మీడియాకు తెలిపారు. ఇది విషాద సంఘటనగా పేర్కొన్నారు. డిసెంబర్ 25న కజకిస్తాన్ లోని అక్టౌ నగరానికి సమీపంలో అజర్ బైజాన ఎయిర్ లైన్స్ ప్యాసింజర్ విమానం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 38మంది ప్రయాణికులు మృతిచెందారు. ఈ విమానాన్ని ఉక్రెయిన్ కు చెందిన డ్రోన్లను కూల్చేందుకు రష్యా ప్రయత్నిస్తుండగా పొరపాటున మిస్సైల్ విమానాన్ని పేల్చివేసింది. శనివారం ఈ ప్రమాదంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ క్షమాపణలు చెప్పారు. ఒకరోజు తరువాత అజర్ బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ ప్రకటన వెలువడింది. కాగా తొలుత విమాన ప్రమాదం సాంకేతిక లోపం కారణంగానే జరిగిందని భావించారు. అనంతరం దర్యాప్తు బృందాల విచారణలో పక్షి ఢీకొందన్నారు. చివరకు అసలు కారణాన్ని కనుగొని అధ్యక్షుడికి తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అధ్యక్షుడి ప్రకటన కంటే ఒక రోజు ముందే జరిగిన తప్పిదాన్ని ఒప్పుకొని క్షమాపణలు తెలిపారు. కాగా ఈ ప్రమాదంలో 38మంది మృతి చెందగా, 29మందికి తీవ్ర గాయాలయ్యాయి.

**" హనుమంతుడి వారసులం మనమందరం వానరులమే.. మన బలమేంటో బాధ్యతలు మీదికి వచ్చేవరకు మనకి తెలియదు ..!! "**



రాధికా ప్రియ

## నిబంధనలు ఉల్లంఘిస్తే
# చర్యలు తప్పవు

- బజార్ హత్నూర్ ఎస్సై అప్పారావు

**అదిలాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**



న్యూ ఇయర్ వేడుకలు సందర్భంగా బజార్ హత్నూర్ ఎస్సై అప్పారావు మాట్లాడుతూ 31 డిసెంబర్ అర్ధరాత్రి 12 గంటల తర్వాత ప్రజలు రహదారుల్లో తిరగకూడదని, పోలీసు పికెటింగ్, రాత్రి గస్తీలు, వాహనాల తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు.
వైద్య, పోలీసు సహకారంతో, ఆంక్షలు పాటిస్తూ న్యూ ఇయర్ వేడుకలు జరపాలని, ప్రజలు ఇంట్లోనే కుటుంబ సభ్యులతో కలసి వేడుకలు జరపాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో కేక్ కటింగ్, పార్టీలు, డీజేలు, లౌడ్స్పీకర్లు ఉపయోగించడం మరియు డ్యాన్సులు చేయడం నిషేధించబడ్డాయని తెలిపారు.అర్ధరాత్రి 12 గంటల తర్వాత ప్రజలు రహదారులపై గుమిగూడి ట్రాఫిక్ను ఇబ్బంది పెట్టరాదని, మహిళలు, యువతులను ఈవీజింగ్ చేయరాదని, మద్యం సేవించి లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని ఆయన స్పష్టం చేశారు.ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసులు, ట్రిబుల్ రైడింగ్పై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తారని, ఇందులో భాగంగా వాహనాలు సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, బాణసంచా సామగ్రి కాల్చడం కూడా నిషేధించారు. మద్యం దుకాణాలు ప్రభుత్వ నిర్ణీత సమయం మేరకే పనిచేస్తాయని, ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని బజార్ హత్నూర్ ఎస్సై అప్పారావు తెలిపారు.



# ధ్యానంతో జ్ఞానం, మనస్సు స్థిరత్వం కలుగుతుంది

- పీఎస్ఎస్ఎం సభ్యురాలు, ధ్యాన గురువు పరిణిత పత్రి

**ఆమనగల్లు, తెలంగాణ ముచ్చట్లు :**

ధ్యాన సాధన చేస్తే జ్ఞానం, మనస్సు స్థిరత్వం, కలుగుతుందని, ప్రతి ఒక్కరి జీవితం శ్వాసపైనే ఆధారపడి ఉంటుందని పీఎస్ఎస్ఎం సభ్యురాలు, ధ్యాన గురువు పరిణిత పత్రి అన్నారు.
కడ్తాల్ లోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్ లో పత్రీజీ ధ్యాన మహా యాగం అత్యంత వైభవంగా జరుగుతోంది. యాగంలో 9వ రోజు నిర్వహించిన యోగా, వేదపఠనం, సంగీత నాధ ధ్యానం కార్యక్రమాలు ధ్యానులను బాగా ఆకట్టుకుంటున్నాయి. యోగా నిపుణులు వెంకటేశ్ యోగా ఆసనాలు, ప్రాణాయం, ముద్రలు, చక్రాలు వంటి గురించి అద్భుతంగా వివరించి వాటిపై ధ్యానులకు చక్కటి అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఒక్కరు ప్రతిరోజు తప్పకుండా యోగా, ప్రాణాయం, ధ్యానం చేయాలని సూచించారు. అనంతరం చైతన్య, మాస్టర్ తేజాలు అద్భుతంగా వేదపఠనం చేసి ధ్యానులకు చక్కటి వేద జ్ఞానాన్ని అందించారు. సంగీత నాధ ధ్యానం కార్యక్రమం ధ్యానులను విశేషంగా అలరిస్తుంది. ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో ధ్యానులు పాల్గొని ఎంతో ఉత్సాహంగా ధ్యాన సాధన చేసి నృత్యాలు చేసి సందడి చేసారు. ధ్యాన మహా యాగంలో బ్రహ్మర్షి పత్రీజీ, స్వర్ణమాల పత్రీ వీడియా సందేశాలు ధ్యానులను బాగా ఆకట్టుకుంటున్నాయి. వీడియా సందేశాలు అందరికి అద్భుతమైన జ్ఞానాన్ని అందించాయి. అనంతరం పత్రీజీ కూతురు పరిణత పత్రీ, బ్రహ్మర్షి పత్రీజీ దివ్య సందేశం గురించి వివరించారు. మనం చేసేది ఏదైనా ఎక్కువ, తక్కువ కాకుండా చూడాలని తెలిపారు. ఈ ధ్యాన మహాయాగంలో పలు అద్భుత పుస్తకాలను ఆవిష్కరిస్తున్నారు. మహారాష్ట్ర మ్యాగజైన్ ను పత్రీజీ కూతురు పరిణిత పత్రీ, సీనియర్ పిరమిడ్ మాస్టర్ చంద్రశేఖర్ రెడ్డి, మహారాష్ట్ర పిరమిడ్ మాస్టర్లు కలిసి ఆవిష్కరించారు. అనంతరం దేవి రచించిన దివ్యస్త్రీతత్వపు జాగృతి అనే పుస్తకం, అనంతరం అనిల్ కుమార్ రచించిన నా ధ్యాన డైరీ అనే పుస్తకం, ఆ తర్వాత రామ్తా క్రియేషన్ అనే పుస్తకాన్ని పరిణిత పత్రీ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



# సిఆర్టిలకు అండగా ఉంటాం

**జిల్లా అధ్యక్షుడు టీఎస్ టి డబ్ల్యూ టి యు రాథోడ్ రవీందర్**

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

సిఆర్టిల నిరవధిక సమ్మె కు మద్దత్తు గా టీఎస్ టి డబ్ల్యూ టి యు, గిరిజన సంక్షేమ పి జి హెచ్ ఎం ల సంఘం తరుపున మూడో సారి 10,000రూపాయలు ఆర్థిక సహాయాన్ని గత 14రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ ల కోసం మినిమమ్ టైమ్ స్కేల్, ఉద్యోగ భద్రత గురించి ఉట్నూర్ ఐటీడీఏ ముందు చేస్తున్న నిరవధిక సమ్మె కు మద్దత్తు గా రెండవ రోజు కుంరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా టీఎస్ టీ డబ్ల్యూ డి యు సంఘం ఆధ్వర్యంలో సి ఆర్ టి లకు సంఘీభావం తెలపడానికి ఉట్నూర్ కు వెళ్లి అక్కడ చెప్పిన విధంగా సి ఆర్ టి లకు తప్ప కుండ తమ సంఘం అండగా ఉంటుందన్నారు. అందులో భాగంగా సి ఆర్ టి ల భోజనాలకోసం టెకంశంకర్ ఎస్జిటి ,బోగారపుశంకర్ ఎస్ జి టి ఉపాధ్యాయులు సభ్యులు ఆసిఫాబాద్ ,గిరిజన పీజీ హెడ్ మాస్టర్ సంఘం తరుపున 10,000/ రూపాయలు అందిచడం జరిగింది అన్నారు. సమ్మె జరుగుతున్న 14వ రోజుకే మూడో సారి సమ్మె శిభిరాన్ని సందర్శించి మూడు సార్లుఆర్థిక సహాయం అందించడం జరిగింది అని ఇంతే కాకుండా భవిష్యత్ లో ఇంకా సి ఆర్ టి ల కు అన్ని విధాలా సహాయ సహకారం తప్పకుండ ఉంటుంది అన్నారు. టీఎస్ టీ డబ్ల్యూ టి యు రాష్ట్ర నాయకత్వం న్యాయమైన డిమాండ్ సాధన కోసం ప్రతి రోజు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి తో సంప్రదింపులు జరిపి సాధ్యమైనంత తొందరగా సమస్యలు పరిస్కారం సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ కివినతి పత్రం ఇవ్వడం దాని పైనా సెక్రటరీ స్పందించి ప్రభుత్వం తరుపున ఐటీడీఏ పీవోకి చర్చలు జరపాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది అని అంతే కాకుండా శనివారం గిరిజన సంక్షేమ శాఖ ఏడి సర్వేషర్ రెడ్డితో చర్చలు జరిపి సి ఆర్ టి ల న్యాయ మైన డిమాండ్ పరిస్కారం కోసం ఒక డెలిగేషన్ ను హైదరాబాద్ కు పిలిపించి వారితో చర్చలు జరపాలని నిర్ణయానికి వచ్చారన్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టీఎస్ టి డబ్ల్యూ టి యు నాయకులు ప్రతి రోజు సిఆర్టిలు నిర్వహిస్తున్న సమ్మె శిబిరం నకు వెళ్లి సంఘీభావం తెలుపుతూ కొంత ఆర్థిక సహాయం అందించి ఇప్పటి వరకు ఇక్కడ స్థానికంగా మద్దతు పలకడం అటు రాష్ట్ర నాయకత్వం ఉన్నత అధికారులు దగ్గర సమస్య పరిస్కారం కోసం ఒత్తిడి పెంచడం మాతృ సంఘం కాబట్టి మీ బాధలు మాకు తెలుసనీ రాష్ట్ర నాయకులు న్యాయ మైన డిమాండ్ సాధనకై రాష్ట్ర రాజధాని లో కృషి చేయడం ఎంతో అభినందనీయం అన్నారు ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో టీఎస్ టీ డబ్ల్యూ టి యు జిల్లా అధ్యక్షకార్యదర్శులు రాథోడ్ రవీందర్ ,మడావి గోపాల్, పీజీ హెచ్ఎంల సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి నైతం కృష్ణరావ్ , కోశాధికారి కూడమేతఅనంత్ బోగారపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
సోమవారం 30 –12–2024




# పెద్దపులి భయంతో కంటిమీద కునుకులేకుండా గడుపుతున్న నల్లబెల్లి వాసులు

**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు బ్యూరో**

పులి అంటే చాలు ప్రజల్లో వణుకు పుడుతుంది. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఉండే పులులు గత కొద్ది రోజులుగా జనావాసాల్లో ఏదో ఒక చోట కనిపించడం, మరికొన్ని చోట్ల పాదముద్రలను అధికారులు గుర్తించడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పెద్దపులి సంచారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వ్యవసాయదారులు, సామాన్య ప్రజానీకం, అటవీ శాఖ అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. పాదముద్రలతో గుర్తింపు : వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని రుద్రగూడెం, కొండాపూర్ మూడు చెక్కలపల్లి, ఒల్లె నర్సయ్యపల్లి తదితర ప్రాంతాలలోని పొలాలలో పెద్దపులి పాదముద్రలు కనిపించడంతో అటవీ శాఖ అధికారులకు అక్కడి రైతులు సమాచారం అందించారు. దీంతో అధికారులు పాదముద్రల ఆధారంగా పెద్దపులి సంచరిస్తుందని నిర్ధారించడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడినంత పనైంది.డ్రోన్ కెమెరాతో వెతుకులాట : అటవీ శాఖ అధికారులు పులి సంచరించిన ప్రాంతాలలో డ్రోన్ కెమెరాను ఉపయోగించి ఆ ప్రాంతాలలోని పొలాలను జల్లెడ పట్టారు. ఎక్కడా పెద్దపులి ఆనవాళ్లు కనిపించక పోవడంతో పులి అక్కడి నుంచి వెళ్లిపోయిందని నిర్ధారించినప్పటికీ ఎప్పటికపుడు అప్రమత్తతో ఉండాలని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. పెద్దపులి గత అర్ధరాత్రి నర్సంపేట మండలం మీదుగా సంచరిస్తూ మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెం అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు అధికారులు నిర్ధారించారు.మహబూబాబాద్ జిల్లాలోకి ప్రవేశించిన పులి : కొత్తగూడెం మండలం అటవీ శాఖ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి అటవీ ప్రాంతంలో పులి ఆనవాళ్ల కోసం తనిఖీలు చేపట్టారు. అడవిలో పులిని గుర్తించడం సాధ్యం కాదని, అనువైన చోట కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. అడవిలోకి ఎవరూ వెళ్లొద్దని ప్రజలకు హెచ్చరికలు జారి చేశారు. పంట పొలాలలో పని చేసుకునేందుకు రైతులు ఒంటరిగా కాకుండా నలుగురు ఐదుగురు రైతులు కలిసి వెళ్లాలని సూచించారు. సాయంత్రం నాలుగు గంటలకే తమ తమ ఇళ్లకు చేరుకోవాలని ముందు జాగ్రత్తగా చెబుతున్నారు. ఎవరికైనా పులి ఆనవాళ్లు కనిపిస్తే స్థానిక అటవీ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



# ఆమెను కాపాడేందుకే వాళ్లిద్దరూ చెరువులో దూకారా?

- **ఎస్సై, మహిళా కానిస్టేబుల్,మరో యువకుడి మృతి కేసులో దర్యాప్తు ముమ్మరం**
- **కేసు మిస్టరీని ఛేదించే పనిలో కామారెడ్డి పోలీసులు**

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎస్సై, మహిళా కానిస్టేబుల్, మరో యువకుడి మృతి కేసులో కామారెడ్డి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రత్యక్ష సాక్షులు గానీ, ఇతర ఆధారాలు గానీ ఏమీ లేవు. ఈ నేపథ్యంలో టెక్నికల్ ఎవిడెన్స్ లు, పోస్టుమార్టం రిపోర్టులు కీలకంగా మారాయి. ఈ నెల 25న భిక్కనూరు ఎస్సై సాయికుమార్, బీబీపేట స్టేషన్ లో పని చేస్తున్న మహిళా కానిస్టేబుల్ శృతి, బీబీపేటకు చెందిన సొసైటీ ఆపరేటర్ నిఖిల్ సదాశివ నగర్ మండలం అడ్లూర్ఎల్లారెడ్డి చెరువులో పడి చనిపోయారు. ఒకేసారి ముగ్గురు చనిపోవడం, వారిలో ఇద్దరు పోలీసు శాఖకు చెందిన వారు కావడంతో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకుంది. తమకు దొరికిన ప్రాథమిక సమాచారం మేరకు అసలు వీళ్ల ముగ్గురి మధ్య ఏం జరిగి ఉంటుందనేది పోలీసులు అంచనా వేస్తున్నారు. నిఖిల్, శృతి మధ్య పెండ్లి ప్రస్తావన అంశంపై చర్చించుకునేందుకు వీళ్లు ముగ్గురు చెరువు వద్దకు వచ్చి ఉంటారని భావిస్తున్నారు. ముగ్గురి మధ్య నెలకొన్న సమస్యపై మాట్లాడుకుంటున్న క్రమంలో శృతి సడెన్ గా చెరువు వైపు పరుగెత్తి అందులో దూకి ఉంటుందని, ఆమెను కాపాడేందుకు నిఖిల్ దూకగా.. వాళ్లిద్దరినీ కాపాడేందుకు ఎస్సై దూకి ఉంటాడని పోలీసు అధికారులు అనుమానిస్తున్నారు.

**టెక్నికల్ డేటానే కీలకం..**

ఈ కేసు ఎంక్వైరీలో టెక్నికల్‌డేటా కీలకం కానుంది. నీళ్లలో మునగడంతోనే ముగ్గురూ చనిపోయినట్టు పోస్టుమార్టం రిపోర్టులో తేలింది. ముగ్గురికి సంబంధించి 5 సెల్‌ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. ఇందులో ఎస్సైవి 2, యువకుడివి 2, మహిళా కానిస్టేబుల్ ది ఒక్కటి ఉంది. ఈ ఐదింటిని ఫోరెన్సిక్‌ల్యాబ్ కు పంపించారు. ఫోరెన్సిక్ రిపోర్టు ద్వారా ఫోన్ కాల్ రికార్డింగ్స్, వాట్సాప్ డేటా సేకరించనున్నారు. మరోవైపు చనిపోయిన వ్యక్తుల బాడీలోని లంగ్స్‌లో ఉన్న నీళ్లను కూడా ల్యాబ్‌కు పంపించనున్నారు.

ఈ నీళ్లను, చెరువులోని నీళ్లతో సరిపోల్చనున్నారు. ఇందుకోసం చెరువులోని నీటి శాంపిల్స్ పోలీసు సిబ్బంది శనివారం సేకరించారు. కాగా, ఎస్పీ సింధూశర్మ కేసు ఎంక్వైరీ గురించి సదాశివనగర్ పోలీస్ స్టేషన్ లో సీఐ సంతోష్‌ను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ఉన్నతాధికారులు కూడా కేసు ఎంక్వైరీపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. దీన్ని సాధ్యమైనంత తొందరగా కంప్లీట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

# ఈ నెల 4న థియేటర్ నిర్వహణను మైత్రీ మూవీస్ తీసుకుంది

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సంధ్య థియేటర్ వద్ద పుష్ప2 ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి థియేటర్ మేనేజ్‌మెంట్‌కు పోలీసులు నోటీసులను ఇచ్చారు. సంధ్య థియేటర్‌కు అన్ని అనుమతులు ఉన్నాయని పేర్కొంటూ పోలీసులు ఇచ్చిన నోటీసులకు థియేటర్ యాజమాన్యం సమాధానం పంపింది. డిసెంబరు 4న పుష్ప2 ప్రీమియర్ షోకు 80 మంది థియేటర్ సిబ్బంది విధుల్లో ఉన్నారని పోలీసులకు ఇచ్చిన సమాధానంలో తెలిపింది. డిసెంబరు 4, 5న సినిమా థియేటర్ నిర్వహణను మైత్రీ మూవీ మేకర్స్ తీసుకుందని తెలిపింది. సినిమాల రిలీజ్ లకు గతంలోనూ హీరోలు థియేటర్‌నకు వచ్చినట్లుగా వివరించింది. సంధ్య థియేటర్‌లో కార్లు, బైక్‌లకు ప్రత్యేక పార్కింగ్ ఉందని సంధ్య థియేటర్ యాజమాన్యం అని తెలిపింది. ఈ మేరకు ఈ వివరాలన్నింటితో కూడిన 6 పేజీల లేఖను సంధ్య థియేటర్ యాజమాన్యం పోలీసులకు పంపింది.

**ఇంతకీ ఏం జరిగిందంటే? :**

డిసెంబరు 4వ తేదీన సంధ్య థియేటర్ వద్ద జరిగినటువంటి తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందింది. ఈ ఘటనలో బాలుడు తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం విధితమే. బాధిత కుటుంబానికి ఇప్పటికే మైత్రీ మూవీ మేకర్స్ 50లక్షల రూపాయలు, హీరో అల్లు అర్జున్ రూ.కోటి, దర్శకుడు సుకుమార్ రూ.50లక్షలను, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రూ.25లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు.

# 'అల్లుఅర్జున్ అభిమానుల నుంచి చంపేస్తామంటూ వందల కాల్స్'

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

హీరో అల్లు అర్జున్ ఫ్యాన్స్ నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయంటూ ఓయూ విద్యార్థి జేఏసీ నేతలు ఓయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.'ఇంటిపై దాడి చేసినందుకు వెంటనే హీరో అల్లు అర్జున్‌కు క్షమాపణ చెప్పాలని అల్లు అర్మీ, అల్లు అర్జున్ అభిమానుల పేరుతో వందల కాల్స్ వస్తున్నాయని జేఏసీ నేతలు ఆరోపించారు. చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ అభిమానుల నుంచి తమకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ఫోన్ నంబర్లను అల్లు అర్జున్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పెట్టి వైరల్ చేస్తున్నారని ఓయూ జేఏసీ నేతలు తమ ఫిర్యాదులో తెలిపారు. తమకు ఫోన్ కాల్స్ రాకుండా చేయాల్సిన బాధ్యత అల్లు అర్జున్‌దేనన్నారు. ఫోన్ కాల్స్ ఆగకపోతే వేలాది మందితో అర్జున్ ఇంటిని ముట్టడిస్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు. ఫోన్ చేసి బెదిరిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

**ఇంతకీ ఏం జరిగిందంటే :**

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి మరణానికి అల్లు అర్జున్ కారణమంటూ ఇటీవల ఓయూ విద్యార్థి జేఏసీ నేతలు అర్జున్ ఇంటివద్ద ఆందోళనకు దిగారు. రేవతి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలని డిమాం డ్ చేస్తూ అల్లు అర్జున్ నివాసంపై రాళ్లను విసిరారు. ఆయన ఇంట్లోకి దూసుకెళ్లేందుకు ఓయూ జేఏసీ నేతలు ప్రయత్నించారు. ఈ క్రమంలో రాళ్లు తగిలి అల్లు అర్జున్ ఇంటి ఆవరణలోని పూల కుండీలు ధ్వంసమయ్యాయి.






# ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అనేక చిక్కుముళ్లు! ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పేదెవరు?!!

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

ఇందిరమ్మ ఇళ్ల పథకం దరఖాస్తుల సర్వే కొనసాగుతోంది. ప్రజాపాలన గ్రామ సభల సందర్భంలో సంక్షేమ పథకాల లబ్ధి కోసం అర్జీలను స్వీకరించిన విషయం తెలిసిందే. ఇందులోనే సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకుంటే రూ.5 లక్షల ఆర్థికసాయం, స్థలం లేని వారికి ఇంటి స్థలంతో పాటు నిర్మించి ఇచ్చే పథకం ఉన్నాయి. దీన్ని ఎంచుకున్న వారి వివరాలను ఇటీవల అందుబాటులోకి తెచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆ డేటా ఆధారంగా ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేస్తూ వివరాలను పరిశీలించి, అర్జీదారు, స్థలం, దస్తావేజులు, ఫొటోలు తీసి యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రజల నుంచి పలు సందేహాలు, ప్రశ్నలు ఎదురవుతున్నాయి. వాటిని నివృత్తి చేయటంలో సిబ్బంది విఫలమవుతున్నారు. అడిగిన ప్రశ్నలకు ఏం సమాధానం చెప్పాలో తెలియక సతమతమవుతున్నారు. ప్రజాపాలన సభల్లో దరఖాస్తులు స్వీకరించి దాదాపు సంవత్సరం కావొస్తుంది. అప్పట్లో తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి పథకాలు అనడంతో కొందరు సొంతంగా ఖళీ స్థలం ఉన్నా ఇంటి పథకానికి అప్లై చేయలేదు. ఇప్పుడేమో రేషన్‌కార్డు లేకున్నా ప్రభుత్వ పథకాలకు అర్హులే అంటున్నారు. కానీ ఇప్పుడు దరఖాస్తు చేద్దామంటే వీలు కాదంటున్నారు. గతంలో పెట్టుకున్న అర్జీల వివరాలు యాప్‌లో పొందుపర్చామని, ప్రస్తుతం వాటిని మాత్రమే సర్వే చేస్తున్నామని సిబ్బంది సమాధానం ఇస్తున్నారు.ఇప్పటికిప్పుడు అంటే ఎలా : దంపతులిద్దరు జిల్లా కేంద్రంలో అద్దింట్లో ఉంటూ చిన్న పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. వీరు ప్రజాపాలనలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి సొంతంగా ఖాళీ స్థలం ఉందని వివరాల్లో రాశారు. కానీ సర్వే సందర్భంలో స్థలం దస్తావేజులు అడుగుతున్నారు. పుట్టింటివారు ఉన్న దాంట్లో ఒక్కపక్కగా ఉన్న వంద, నూటయాభై చదరపు గజాలు పసుపు కుంకుమల కింద ఇస్తారు, వీటికి పత్రాలు రాసుకోరు అని సర్వేయర్లకు చెప్పగా, వారు పెద్దమనుషుల సమక్షంలో రాసుకున్న పత్రాలైనా తీసుకురావాలని అంటున్నారు. ఇప్పటికిప్పుడు రాయించుకుని రావడం అంటే ఇబ్బందేనని అర్జీదారులు వాపోతున్నారు. సర్వే ప్రక్రియకు ఆటంకంగా మారటంతో సిబ్బంది స్థలం లేదని వివరాలు నమోదు చేస్తున్నట్లుగా ఫిర్యాదులందుతున్నాయి. సర్వేయర్లు చెప్పకపోతే ప్రజలకు ఎలా తెలిసేది : నిజామాబాద్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్న కుటుంబానికి కామారెడ్డి జిల్లాలో స్థలం ఉంది. వీరు ప్రజాపాలన దరఖాస్తు నిజామాబాద్‌లోని అద్దెంటి చిరునామాతో పెట్టారు. సర్వే సిబ్బంది ఇక్కడ ఇంటి వద్ద మహిళను ఫొటో, పక్క జిల్లాలో ఉన్న స్థలం దస్తావేజులు ఫొటో తీసి యాప్‌లో పొందుపర్చారు. కానీ, స్థలం వద్ద మహిళను నిల్చోబెట్టి ఫొటో తీసి పొందుపర్చాలనేది నిబంధన. జీపీఆర్ఎస్ ప్రకారం ఆ స్థలంలో ఇల్లు నిర్మిస్తేనే బిల్లు ఇస్తారని తెలిపారు. కానీ సర్వే సిబ్బంది పక్క జిల్లాలో ఖాళీ స్థలం వద్ద ఫొటో దిగాలి అన్న విషయం చెప్పటం లేదు. ఇలాంటి దరఖాస్తులను స్థలం ఉన్న జిల్లాకు బదిలీ చేయాలని సూచించినా సర్వేయర్లు చేయటం లేదు. ఈ అర్జీదారుల భవిత్యం ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.



# అన్నా యూనివర్సిటీ అత్యాచారం కేసుపై సిట్

- **బాధితురాలికి రూ.25 లక్షల పరిహారం**
- **మద్రాస్ హైకోర్ట్**

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

అన్నాయూనివర్సిటీ ప్రాంగణంలో విద్యార్థినిపై సామూహిక అత్యాచారం కేసు విచారణకు మద్రాసు హైకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ అధికారులుగా మహిళా ఐపీఎస్‌లనే నియమిస్తూ న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. ఐపీఎస్ అధికారిణిలు స్నేహప్రియ, ఆయ్మన్ జమాల్, బృంద నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసింది. డిసెంబర్ 23న అన్నా యూనివర్సిటీ ప్రాంగణంలో విద్యార్థినిపై ఇద్దరు యువకులు అత్యాచారం చేశారు. విద్యార్థినితో ఉన్న ఆమె స్నేహితుడ్ని తీవ్రంగా కొట్టి ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ కేసులో పోలీసుల ఎఫ్ఐఆర్ లీకవడం వల్ల బాధితురాలి వ్యక్తిగత వివరాలు బయటకురావడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. కేసును సుమోటాగా స్వీకరించింది మద్రాస్‌హైకోర్టు. అయితే, సాంకేతిక లోపం తలెత్తడం వల్లే ఎఫ్ఐఆర్ లీకై ఉండొచ్చని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు.

**రూ.25 లక్షల పరిహారం**

ఎఫ్ఐఆర్ లీకవడం వల్ల బాధితురాలికి జరిగిన నష్టానికి రూ.25 లక్షల పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. కేసు వివరాలు మీడియాకు వెల్లడించినందుకు చెన్నై పోలీసు కమిషనర్‌పై అవసరమైతే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. బాధితురాలికి చదువుకున్నన్ని రోజులు ఉచిత విద్య, బోర్డింగ్, లాడ్జింగ్, కౌన్సెలింగ్ సౌకర్యాలను కల్పించాలని అన్నాయూనివర్సిటీని హై కోర్టు ఆదేశించింది. మహిళలు, పిల్లలపై లైంగిక నేరాల కేసుల్లో ఎఫ్ఐఆర్ లీకేజీ జరగకుండా చూసుకోవాలని తమిళనాడు డీజీపీని ఆదేశించింది.

**ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే!**

అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచారంపై డీఎంకే ఎంపీ కనిమొళి స్పందించారు. "ఎలాంటి పక్షపాతం లేకుండా నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఆదేశించారు. అందుకు అనుగుణంగానే నిందితుడిని అరెస్ట్ చేసి చర్యలు తీసుకున్నాం. మహిళా విద్య, హక్కుల కోసం డీఎంకే పార్టీ నిరంతరం కృషి చేస్తూనే ఉంది" అన్నారు.

# పదో తరగతి వరకు తెలుగు తప్పనిసరిగా ఉంచేలా చర్యలు చేపట్టాలి

- **జేడీ లక్ష్మీనారాయణ**

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**



సహజసిద్ధంగా వచ్చే భాషే మాతృభాషని విశ్రాంత ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. అమ్మ అనే పదంలో ఉన్న మాధుర్యం మమ్మీలో రాదన్నారు. పసితనంలో మాతృభాషను చంపేయడం భ్రూణహత్యతో సమానమన్నారు. విజయవాడలో నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల 6వ మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. తెలుగు భాషాభివృద్ధి, భాష పరిరక్షణ, రాజకీయ నాయకుల పాత్రపై ఆయన మాట్లాడారు. భాష అభివృద్ధిలో రాజకీయ నాయకుల పాత్ర కీలకం : ఇంగ్లీష్ మీడియం వద్దు అంటే ఇంగ్లీష్‌ను వ్యతిరేకించడం కాదని జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎందుకంటే జాతీయ విద్యావిధానాన్ని పరిశీలించినట్లయితే ఐదో తరగతి వరకు వీలైతే ఎనిమిదో తరగతి వరకు భోదన మాతృభాషలో జరగాలని తెలియజేయడం జరిగిందని వివరించారు. సహజమైన భోదన లేకుండా భోదనాప్రక్రియ కృత్రిమంగా జరిగితే పిల్లలో రియాలిటీ ఉండదని ఆయన అన్నారు. కృత్రిమత్వమే వస్తుంది అనే విషయాన్ని అందరూ గమనించాల్సి ఉంటుందని జేడీ అభిప్రాయపడ్డారు. భాష అభివృద్ధిలో రాజకీయ నాయకుల పాత్ర చాలా ముఖ్యమైందని ఆయన గుర్తుచేశారు. తెలుగుభాష అనేది రాగానుయుక్తమైన భాష అన్న జేడీ లక్ష్మీనారాయణ మాతృభాషను నేర్చుకుంటే ఇతర భాషల్లో సులభంగా ప్రావీణ్యం సంపాదించవచ్చని అభిప్రాయపడ్డారు.



# ఉద్యమ నిరుద్యోగ కళాకారుల కమిటీ ఎన్నిక

**భువనగిరి ,తెలంగాణ ముచ్చట్లు:**

యాదాద్రి భువనగిరి జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల కమిటీ ఏకగ్రీవంగా జిల్లాలోని అందరి కళాకారుల సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మీసాల గణేష్, ఉపాధ్యక్షుడిగా వేముల హరిక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి నకిరేకంటి కుమార్, సంయుక్త కార్యదర్శిగా బంటు తిరుమలేశ్, కోశాధికారి పిట్టల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి సురుపంగ గణేష్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి పోలేపల్లి నర్సింహా, సహాయ కార్యదర్శి బూడిద కిషన్, సాంస్కృతిక కార్యదర్శి మార్గం సత్తయ్య, సాంస్కృతిక కన్వీనర్ జేరిపోతుల కరుణాకర్, కమిటీ సభ్యులుగా పాండాల ప్రవీణ్, కానుకుంట్ల పుష్ప, కోట్లోజు బాలమణి ఏకగ్రీవంగా జిల్లాలోని ఉద్యమ నిరుద్యోగ కళాకారులు అందరి సమక్షంలో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బట్టు రామచంద్రయ్య (సీనియర్ రాజకీయనాయకులు) హాజరయ్యారు. సోమ జాన్ రెడ్డి, కూరెళ్ళ మహేష్, దేవేందర్ , సతీష్ , మధు, వెంకటేశం, శ్రీనివాస్, లింగస్వామి, నరేష్ తదితర కళాకారులు పాల్గొన్నారు.

**పట్టణంలో విద్యుత్ నిలిపివేత**

భువనగిరి పట్టణంలో గల మెయిన్ రోడ్డు విస్తరణలో భాగంగా బొమ్మాయిపల్లి అండర్‌పాస్ నుంచి హైదరాబాద్ చౌరస్తా వరకు LT లైన్స్ టవర్స్ మీదికి లైన్ షిఫ్టింగ్ వర్క్‌ల నిమిత్తం పట్టణంలో సోమవారం రోజున విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ మేరకు అధికారులు తెలిపారు. టవర్స్ మీదికి కొత్త లైన్ లాగుతున్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భువనగిరి పట్టణంలో రోడ్డుకి ఇరువైపులా సాయి కన్వెన్షన్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, వైయస్సార్ గార్డెన్ బ్యాక్ సైడ్, మెయిన్ రోడ్డుకి ఇరువైపులా హైదరాబాద్ చౌరస్తా వరకు, జలీల్ పుర ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. భువనగిరి పట్టణ ప్రజలందరూ సహకరించాలని విద్యుత్ ఏఈ కోరారు .




# యాద్రాద్రిలో భక్తుల రద్దీ

**యాదగిరిగుట్ట ,తెలంగాణ ముచ్చట్లు:**

యాదగిరిగుట్ట పంచ నరసింహ పుణ్యక్షేత్రంలో ఆదివారం సందర్భంగా భక్తులతో కోలాహలం నెలకొంది. ఆర్జిత పూజలు, దైవ దర్శనాలతో ఆధ్యాత్మిక సందడి ఏర్పడింది. ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనం సముదాయాలలో భక్తులు బారులు తీరి కనిపించారు. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ శివాలయంలోనూ ఆరాధన పర్వాలు కొనసాగాయి. కొండకింద మండపంలో భక్త దంపతులు శ్రీసత్య నారాయణ స్వామి వ్రతాలను నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు. కల్యాణ కట్ట, పుష్కరిణీ చెంత కోలాహలం నెలకొంది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల నుంచి, చుట్టు పక్కల ఉన్న ప్రాంతాలు, జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు, యాత్రికుల వాహనాలతో పార్కింగ్ స్థలాలు నిండిపోయాయి.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక

# తీర్పులు తెలుగులో ఇస్తేనే సులువుగా అర్థమవుతాయి



**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

తెలుగు భాష అమల్లో లోపాలను సరిదిద్దుకుని ముందుకెళ్దామని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు తెలిపారు. 'అమ్మ భాషను మాట్లాడదాం ఆత్మాభిమానం చాటుకుందాం' అని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో భాగంగా నిర్వహించిన 'తెలుగులో న్యాయపాలన' సమావేశంలో జస్టిస్ కె. మన్మథరావు మాట్లాడారు. తెలుగులో తీర్పు రాశాను అనే విషయం తనకెంతో ఆనందంగా ఉందని జస్టిస్ కె.మన్మథరావు అన్నారు. న్యాయమూర్తి అయ్యాక ఎక్కడికి వెళ్లినా మాతృభాషలోనే మాట్లాడినట్లు పేర్కొన్నారు. తెలుగులో తీర్పులు ఇస్తేనే ప్రజలకు సులువుగా అర్థమవుతుందని తెలిపారు. తెలుగులో తీర్పు ఇచ్చినప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నా ఆయన, ఆంగ్లంలో ఉన్న తీర్పును తెలుగులోకి మార్చి తీర్పు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ తీర్పుల వల్ల అప్పీళ్లకు వెళ్లడం తగ్గుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. తీర్పు తెలుగులో ఉంటే మరింత పారదర్శకత ఉంటుందని ఆయన అన్నారు.

వాళ్లే స్ఫూర్తి : మాతృభాషలో డాక్యుమెంట్ ఉన్నా కొందరు ఆత్మన్యూనతతో ఆంగ్లంలో చదువుతున్నారని జస్టిస్ భీమపాక నగేశ్ అన్నారు. తాము తెలుగులో తీర్పు ఇస్తే ఆంగ్లంలో అభినందనలు వచ్చాయని ఆయన గుర్తుచేశారు. మాతృభాషలో చదువుకునే హైకోర్టు న్యాయమూర్తుల స్థాయికి ఎదిగామని, తెలుగు భాష సహకారంతో వృత్తిపరంగా ఎక్కువ బాగుపడ్డామన్నారు. మాతృభాషలో తీర్పు ఇచ్చేందుకు తనకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, జస్టిస్ ఎన్వీ రమణ స్ఫూర్తి అని పేర్కొన్నారు. తెలుగును బాగా చదివితే ఆంగ్ల అనువాదం, నేర్చుకోవడం చాలా సులభమవుతుందని తెలిపారు. మన తెలుగు భాష అద్భుతమైందన్న ఆయన దీన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.ప్రతి ఒక్కరూ తెలుగు భాష మాధుర్యాన్ని అనుభవించాలని జస్టిస్ బి.కృష్ణమోహన్ తెలిపారు. తల్లిదండ్రులు చిన్నారులకు భాషలోని లెస్సదనాన్ని తెలియజెప్పాలని, మన కవులు, వాగ్గేయకారుల గురించి తెలియజేయాలని అన్నారు. మాతృభాషను కేవలం వాడుగ భాషగానే పరిగణించడం సరైంది కాదన్న ఆయన పిల్లలకు తల్లిదండ్రులు మాతృభాష అందిస్తేనే భవిష్యత్తులో తెలుగుని చూడగలమని, వినగలమని, ఎందరో మహానుభావులు తెలుగు భాష అభివృద్ధి కోసం కృషి చేశారని గుర్తు చేశారు. పాఠశాలల్లో మాతృభాషను ఆప్షనల్ సబ్జెక్టుగా చేయొద్దన్నారు. పదో తరగతి వరకు తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయాలని కోరారు. తెలుగు వ్యవహారాలు పెంచేలా చర్యలు : హైకోర్టులో మాతృభాష ఎక్కువగా అమలు చేయడంపై చాలా విధాలుగా ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఇంగ్లీష్‌తో సమానంగా తెలుగులో అర్థం వచ్చేలా కచ్చితమైన పర్యాయపదాల సృష్టిపై కృషి చేస్తున్నామన్నారు. గతంలో కోర్టుల్లో అనువాదాకుల పోస్టులుండగా తీసేశారు, మళ్లీ ఇప్పుడు ఆ పోస్టులను తిరిగి తీసుకురావాల్సిన అవసరముందని తెలిపారు. కృత్రిమ మేధను వినియోగించుకుని కోర్టుల్లో డిజిటలైజేషన్, ఆధునీకీకరణ చేస్తున్నామన్న ఆయన న్యాయస్థానాల్లో తెలుగు వ్యవహారాలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.తెలుగు భాష అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తున్నట్లు జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. మాతృభాషలో భావ వ్యక్తీకరణ చాలా స్పష్టంగా ఉంటుందని తెలిపారు. కింది కోర్టు వ్యవహారాలు మాతృభాషలో జరుపుకోవచ్చని ఆదేశాలున్నాయన్న ఆయన మాతృభాష ఉండాలని కొన్ని రాష్ట్రాలు సుప్రీంకోర్టును కోరాయని వివరించారు. తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రం ఒక్క ప్రతిపాదన వెళ్లలేదని ఆవేదన వ్యక్తిం చేశారు. హైకోర్టు వ్యవహారాలు తెలుగులోనే ఉండాలనే దానిపై చర్చ జరగాలన్న ఆయన కోర్టుల్లో జరిగేది 99 శాతం మందికి అర్థం కావడం లేదని సీజేఐనే చెప్పారని గుర్తు చేశారు. తెలుగులో వాదనలు వినిపించేందుకు హైకోర్టుల్లో నిషేధం లేదని స్పష్టం చేశారు. తెలుగులో చదివితే న్యాయపాలన సమర్థంగా : భాష లేకపోతే పదానికి తేజస్సు ఉండదని మహనీయులు చెప్పారని పేర్కొన్నారు. పదకోశం సరిగా లేక తెలుగులో తీర్పులు ఇచ్చేందుకు సమస్యలు వస్తున్నాయన్న ఆయన మాతృభాషలో తీర్పులు ఇస్తేనే కక్షిదారులకు అవగాహన వస్తుందని వివరించారు. తెలంగాణ హైకోర్టులో 1,100 తీర్పులు, ఏపీ హైకోర్టులో 547 తీర్పులను అనువదించినట్లు తెలిపారు. తెలుగులో 'లా' చదివితే న్యాయపాలన సమర్థంగా ఉంటుందని కోర్టులో విచారణ జరిగిన తీరు కక్షిదారుడికి తప్పనిసరిగా తెలియాలన్నారు. తెలుగులో న్యాయపాలన అమలుకు సూచనలు ఇవ్వాలని, సలహాలు, సూచనలపై చర్చించి సరైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# మహా'లక్ష్మి' పరుగులు

**మిర్యాలగూడ,తెలంగాణ ముచ్చట్లు:**

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: కరోనా నుంచి నష్టాల బాటలో పయనించిన ఆర్టీసీ గత మూడేళ్లుగా ఆదాయం రాబట్టేందుకు కృషి చేస్తోంది. సంస్థ ఉన్నతాధికారుల చర్యలు, సిబ్బంది కృషి ఫలితంగా ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోలు లాభాల బాట పట్టాయి. ముఖ్యంగా గతేడాది డిసెంబరు 9 నుంచి కొత్త ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ గణనీయంగా పెరిగింది. అన్ని డిపోల్లోని బస్సుల్లో వందకు పైగా ఓఆర్ నమోదవుతూ..ఈ ఏడాది కాలంలో మొత్తం రూ.566.99కోట్ల లాభాలు గడించింది.

**6.67 కోట్ల మంది మహాలక్ష్ములు..**

మహాలక్ష్మి పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో మొత్తం 6.67 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. వీరిలో పెద్దలు 6.39 కోట్ల మంది ఉండగా..పిల్లలు 28.71లక్షల మంది ఉన్నారు. మొత్తం ప్రయాణికుల్లో మహిళల వాటా 63.35శాతం ఉంది. మహిళా ప్రయాణికుల ద్వారా ఆర్టీసీకి ఈ ఏడాది రూ.282 కోట్ల ఆదాయం సమకూరింది. అత్యధికంగా సూర్యాపేట డిపోలో రూ.64.40కోట్లు మహిళల ఆర్టీసీకి ఆదాయం సమకూరింది.

**దేవరకొండలో అత్యధికం..**

ఉమ్మడి జిల్లాల్లో అత్యధికంగా దేవరకొండ డిపోలో రూ.105.33 కోట్ల ఆదాయం రాగా..ఆ తర్వాత స్థానంలో సూర్యాపేట డిపోకు 105.10 కోట్ల ఆదాయం వచ్చింది. నల్గొండ డిపోలో అత్యధికంగా 1.73 కోట్ల కిలోమీటర్ల మేర బస్సులు తిరగగా...సూర్యాపేట డిపోలో 1.66కోట్ల కిలోమీటర్లు బస్సులు తిరిగాయి. సూర్యాపేట డిపోలో అత్యధికంగా 2.02 కోట్ల మంది బస్సుల్లో ప్రయాణించగా..ఆ తర్వాతి స్థానంలో దేవరకొండలో 1.83కోట్ల మంది ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. బస్ పాసుల ద్వారా అత్యధికంగా దేవరకొండ డిపోలో రూ.1.28కోట్ల ఆదాయం సమకూరగా..రూ.76.15లక్షలతో నల్గొండ డిపో రెండో స్థానంలో నిలిచింది.

**అవీ ఇవీ..**


ఆర్టీసీలో ఏటా అందించే ప్రగతి చక్రం అవార్డుల్లో ఉమ్మడి జిల్లా ముందంజలో నిలిచింది. ఉత్తమ ఆర్ఎంగా అప్పటి ఆర్ఎం శ్రీదేవి, ఉత్తమ డిప్యూటీ ఆర్ఎంగా శివశంకర్, ఉత్తమ బస్టాండ్‌గా సూర్యాపేట హైటెక్ బస్టాండ్‌తో పాటు మొత్తం 11 అవార్డులు వచ్చాయి.

ఈ ఏడాదిలో సంక్రాంతి, దసరా, కార్తికమాసం వంటి ప్రత్యేక సందర్భాలలో పంచారామాలు, అరుణాచలం వంటి ప్రాంతాలకు నడిపిన ప్రత్యేక బస్సులతో పాటు వివిధ శుభకార్యాలు, ప్రముఖుల సమావేశాల నిమిత్తం నడిపిన బస్సుల అద్దెల ద్వారా రూ. కోట్లలో ఆదాయం సమకూరింది.

కార్మికుల సంక్షేమ కోసం ఆర్టీసీ పలు రకాల చర్యలు చేపట్టింది. ముఖ్యంగా సిబ్బందికి ఆరోగ్య శిబిరాల ద్వారా వైద్య పరీక్షలు, అవసరమైన చికిత్సలతో పాటు.. శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి.. ప్రయాణికులతో ఎలా మసలుకోవాలో బోధించింది. మరో వైపు సిబ్బందిలో ఐకమత్యాన్ని పెంపొందించేందుకు వనభోజనాల కార్యక్రమం, ఇటీవల షిర్డీకి ఉచిత బస్సు ఏర్పాటు చేసింది.

**ఉమ్మడి జిల్లాలో 105 కొత్త బస్సులు**

ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోలలో ఈ ఏడాది మొత్తం 105 కొత్త బస్సులు వచ్చాయి. వీటిలో అత్యధికంగా పల్లె వెలుగు బస్సులు 59 వచ్చాయి. దేవరకొండ డిపోకు 8 పల్లెవెలుగు, 10 ఎక్స్‌ప్రెస్ బస్సులు, నల్గొండ డిపోకు 16 పల్లెవెలుగు, ఒక ఎక్స్‌ప్రెస్, 2 సెమీ డీలక్స్, 4 డీలక్స్ బస్సులు, నార్కట్‌పల్లి డిపోకు రెండు పల్లెవెలుగు, మిర్యాలగూడకు 10 పల్లెవెలుగు, యాదగిరిగుట్ట డిపోకు ఒక పల్లెవెలుగు, 9 ఎక్స్‌ప్రెస్, 2 డీలక్స్, కోదాడ డిపోకు 5 పల్లెవెలుగు, 5 ఎక్స్‌ప్రెస్, సూర్యాపేట డిపోకు 17 పల్లెవెలుగు, 11 ఎక్స్‌ప్రెస్, 2 సెమీ డీలక్స్ బస్సులు కొత్తగా వచ్చాయి.



## మన్‌కీ బాత్‌లో అక్కినేని నాగేశ్వరరావుపై
# ప్రధాని మోదీ ప్రశంసలు

**తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు తీసుకెళ్లారని వ్యాఖ్య**

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

భారత చలనచిత్ర రంగానికి చెందిన నలుగురు దిగ్గజాలు అక్కినేని నాగేశ్వరరావు, రాజ్ కపూర్, మహ్మద్ రఫీ, తపన్ సిన్హాను మన్ కీ బాత్ రేడియో కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ స్మరించుకున్నారు. దేశానికి ప్రపంచ గుర్తింపు తీసుకురావడంలో కీలకపాత్ర పోషించిన సినీ ప్రముఖుల శత జయంతి వేడుకలను 2024లో జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ దిగ్గజాలు భారత చలనచిత్ర పరిశ్రమకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఏఎన్ఆర్ తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు తీసుకెళ్లారని మోదీ కొనియాడారు. ఆయన సినిమాలు భారత సంప్రదాయాలు, విలువలను అందంగా ఆవిష్కరించాయని చెప్పారు. సినిమాల ద్వారా రాజ్ కపూర్ దేశ సాఫ్ట్ పవర్ గురించి ప్రపంచానికి తెలిసేలా చేశారని మోదీ తెలిపారు. మహ్మద్ రఫీ మాయాస్వరం ప్రతి శ్రోత హృదయాన్ని తాకుతుందని ప్రధాని అన్నారు. తపన్ సిన్హా సినిమాలు సామాజిక స్పృహ, జాతీయ సమైక్యత సందేశాన్ని అందించాయని గుర్తు చేశారు.


**'మహాకుంభ మేళా- ఐక్యతా కుంభం'**

ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13న ప్రారంభంకానున్న మహా కుంభమేళాను ఐక్యతా మహాకుంభంగా ప్రధాని మోదీ అభివర్ణించారు. యావత్ దేశం ఐక్యంగా ఉండాలనే సందేశం మహాకుంభ మేళా నుంచి వెలువడాలని చెప్పారు. మహాకుంభ మేళా ప్రత్యేకత విశాలతలోనే కాదు, వైవిధ్యంలో కూడా ఉందని ప్రధాని పేర్కొన్నారు. కుంభమేళాలో తొలిసారిగా AI చాట్‌బాట్‌ను ఉపయోగించనున్నట్టు తెలిపిన మోదీ మేళాకు సంబంధించిన అన్ని రకాల సమాచారం AI చాట్‌బాట్ ద్వారా 11 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంటుందన్నారు.

వచ్చే గణతంత్ర దినోత్సవం రోజున రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తవుతుందని మోదీ గుర్తుచేశారు. రాజ్యాంగం వల్లే తన జీవితంలో ఈ స్థానానికి చేరుకున్నానని, అది అందరికీ మార్గదర్శకమని ప్రధాని తెలిపారు. రాజ్యాంగంలోని నిబంధనలు, స్ఫూర్తితో ప్రజలను కనెక్ట్ చేయడానికి కాన్‌స్టిట్యూషన్ 75 డాట్‌కామ్ అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్టు మోదీ తెలిపారు. రాజ్యాంగాన్ని కేంద్రం నిర్వీర్యం చేస్తోందని ప్రతిపక్షాలు తరచూ ఆరోపిస్తున్నాయని, వాటిని అధికారపక్షం తీవ్రంగా ఖండిస్తోందని గుర్తు చేశారు.

**'తమిళం నేర్చుకునేవారి సంఖ్య పెరుగుతోంది'**

ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా క్రీడలు, ఫిట్‌నెస్‌కు సంబంధించిన అనేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ప్రధాని మోదీ చెప్పారు. కశ్మీర్‌లో స్కీయింగ్ నుంచి గుజరాత్‌లో గాలిపటం ఎగురవేయడం వరకు క్రీడల పట్ల ఉత్సాహం ప్రతిచోటా కనిపిస్తుందని చెప్పారు. సండే ఆన్ సైకిల్, సైక్లింగ్ ట్యూస్‌డే వంటి కార్యక్రమాలతో సైక్లింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు.వచ్చే ఏడాది తొలి వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్‌వేవ్స్‌ను మన దేశంలో నిర్వహించబోతున్నట్టు ప్రధాని చెప్పారు. దేశాన్ని ప్రపంచ కంటెంట్ సృష్టికి కేంద్రంగా మార్చడానికి ఈ శిఖరాగ్ర సమావేశం ఒక ముఖ్యమైన అడుగు అని వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన భాష తమిళమని, ఇది ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయమని చెప్పారు. ప్రపంచ దేశాల్లో తమిళ భాషను నేర్చుకునే వారి సంఖ్య నిరంతరం పెరుగుతోందని ప్రధాని మోదీ తెలిపారు.





# మహా కుంభమేళాకు ముస్తాబవుతున్న అయోధ్య

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

మహా కుంభమేళా కోసం అయోధ్య నగరం ముస్తాబవుతోంది. వచ్చే ఏడాది రామమందిరం ప్రారంభోత్సవం తర్వాత తొలిసారి మహా కుంభమేళా జరుగుతుండడం వల్ల అయోధ్యను అందంగా తీర్చిదిద్దుతున్నారు. నూతన ఏడాదిలోకి అడుగుపెట్టడం, బాల రాముడు కొలువుదీరి సంవత్సరం పూర్తి కావొస్తుండటంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశాలు ఉంది. అందుకే ఎలాంటి నిర్వహణ లోపాలు తలెత్తకుండా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. నూతన ఏడాది, మహా కుంభమేళా పురస్కరించుకొని అయోధ్య నగరం అందంగా ముస్తాబవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 44 రోజుల పాటు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళా కోసం అక్కడి ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ కుంభమేళాకు కోట్ల మంది ప్రజలు తరలిరానున్నారు. కుంభమేళాకు వచ్చిన ప్రజలు అయోధ్య బాలరాముడి దర్శనానికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. రామమందిర ప్రారంభోత్సవం తర్వాత తొలిసారి కుంభమేళా జరుగుతుండడం వల్ల అయోధ్యలోనూ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.అదే సమయంలో నూతన ఏడాదిలోకి అడుగుపెట్టడం., బాలరాముడు కొలువుదీరి సంవత్సరం పూర్తి కావొస్తుండటంతో అయోధ్యకు భారీగా భక్తులు తరలి రానున్నారు. దీంతో ఎలాంటి నిర్వహణ లోపాలు తలెత్తకుండా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అయోధ్య రామ మందిర దర్శన వేళలు పెంచుతూ రామ జన్మభూమి తీర్థ క్షేత్రట్రస్ట్ నిర్ణయం తీసుకుంది.

**అయోధ్య నగర అలంకరణ**

అయోధ్య నగర వీధులను రాముని చిత్రాలతో అందంగా అలంకరిస్తున్నారు. రామ చరిత మానస్‌ను గోడలపై రూపొందించారు. గుప్తర్ ఘాట్ నుంచి కొత్త ఘాట్ వరకు రామాయణ ఇతివృత్తాలను గోడలపై చిత్రాల రూపంలో రూపొందిస్తున్నారు. రాత్రి వేళలో కూడా కనిపించేలా వాటికి విద్యుత్ దీపాలను అమర్చారు. అయోధ్యకు తరలివచ్చే భక్తుల కోసం మంచి నీటి సదుపాయన్ని ఏర్పాటు చేశారు.అలాగే అయోధ్యలోని సూరజ్‌కుండ్‌లో లేజర్ షోను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కుంభమేళా జరుగుతోన్న అన్ని రోజులు లేజర్ షో జరుగుతుందని చెప్పారు. రామాయణ చరిత్రను హిందీ, ఇంగ్లీషు భాషలలో వీడియోల రూపంలో ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. కుంభమేళా కోసం వచ్చే విదేశీయులు కోసం ఆంగ్ల భాషలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

**హోటళ్లు ఫుల్!**

కొత్త సంవత్సరం వేళ అయోధ్య నగరం పర్యటకులతో కళకళలాడనుంది. నూతన ఏడాది వేళ పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే హోటల్ గదులన్నీ ముందుగానే బుక్ అయినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు స్వాగతం పలికేందుకు అంతా సిద్ధంగా ఉందని జనవరి 15 వరకు హోటల్ గదులన్నీ ముందుగానే బుక్ అయినట్లు స్థానిక హోటల్ యజమానులు చెబుతున్నారు. చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే గదుల లభ్యత ఉందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదే అదనుగా కొందరు హోటళ్ల యజమానులు ఒక్కరోజుకు 10వేల రూపాయలు వరకు వసూలు చేస్తున్నట్లు వెల్లడించాయి. రాముడి ఆలయం, హనుమాన్‌గఢి, లతాచౌక్, గుప్తర్ ఘాట్, సూరజ్‌కుండ్, ఇతర ప్రఖ్యాత స్థలాల వద్ద భారీగా భద్రతా ఏర్పాటు చేసినట్లు అయోధ్య పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

**పెరగనున్న డిమాండ్**

మరోవైపు నూతన ఏడాది వస్తున్న వేళ అయోధ్యలో పువ్వులకు గిరాకీ పెరుగుతోంది. జనవరి మూడో తేదీ వరకు పూలకు గిరాకీ ఉండే అవకాశం ఉందని పూలు అమ్మేవాళ్లు చెబుతున్నారు. కొత్త ఏడాది వేళ దేశ నలుమూల నుంచి రాముడి దర్శనానికి భక్తులు రానున్న నేపథ్యంలో పువ్వులకు డిమాండ్ పెరుగుతున్నట్లు చెప్పారు. ప్రధానంగా బంతి పూలు, చామంతి పూలు, గులాబీ పువ్వులకు మంచి గిరాకీ ఉందని తెలిపారు.




# ఇక 'విజయ' నెయ్యినే వాడాలి!

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

లడ్డూలు, ఇతర ప్రసాదాల తయారీకి వాడే నెయ్యి విషయంలో రాష్ట్ర దేవాదాయశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అన్ని ఆలయాల్లో ప్రభుత్వరంగ సంస్థ విజయ డెయిరీ నెయ్యినే వాడాలని ఈవోలను ఆదేశించింది. ఇప్పటికే అమల్లో ఉన్న ఒప్పందాలను సైతం రద్దు చేయాల్సిందేనని స్పష్టంచేసినట్లు సమాచారం. దీంతో యాదగిరిగుట్ట సహా పలు దేవాలయాల్లో జనవరి 1 నుంచి 'విజయ' నెయ్యిని లడ్డూలు, ప్రసాదాల్లో వినియోగించేందుకు సిద్ధమవుతున్నారు.

**3 నెలల ముందే నిలిపివేత!**

తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూల తయారీకి వాడే నెయ్యి టెండర్ల విషయం వివాదమైన నేపథ్యంలో రాష్ట్ర దేవాదాయశాఖ స్పందించింది. 'విజయ' నెయ్యినే వాడాలని ఆగస్టు 22న ఆదేశాలిచ్చింది. అయినప్పటికీ అనేక ఆలయాల్లో పాత గుత్తేదారుల నుంచే నెయ్యిని తీసుకుంటున్నారు. శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో అయితే కొత్తగా ఏకంగా ప్రైవేటు డెయిరీకి కట్టబెట్టారు. ఈ వైనంపై 'భద్రాచలంలో నెయ్యి ప్రైవేటుకే' శీర్షికన డిసెంబరు 16న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. భద్రాచలం ఆలయ ఈవోకు మెమో జారీచేశారు. అన్ని ఆలయాల ఈవోలతో సమావేశం నిర్వహించాలని కమిషనర్ శ్రీధర్‌ను దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్ ఆదేశించారు. కొద్దిరోజుల క్రితం ఆన్‌లైన్ సమావేశం నిర్వహించిన కమిషనర్.. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ప్రభుత్వ నిర్ణయం మేరకు విధిగా 'విజయ' నెయ్యినే వాడాలని స్పష్టంచేశారు. చాలా దేవాలయాలు 2025 మార్చి వరకు గడువుతో నెయ్యి సరఫరా ఒప్పందాలు చేసుకున్నాయి. మూడు నెలల ముందే ప్రభుత్వం వాటిని రద్దుచేస్తున్నట్లు తెలిసింది.

**యాదగిరిగుట్టలో..**

యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి జనవరి 1 నుంచి నెయ్యి సరఫరా చేయాలని ఈవో.. విజయ డెయిరీని కోరారు. ప్రస్తుతం ఉమ్మడి నల్గొండ జిల్లాలో పెద్దఎత్తున పాలను సేకరిస్తున్న ఓ డెయిరీ దీర్ఘకాలంగా ఈ దేవాలయానికి నెయ్యి సరఫరా చేస్తోంది. మార్చి వరకు ఉన్న ఒప్పందాన్ని కొనసాగించేందుకు ఒత్తిళ్లు వస్తున్నట్లు తెలిసింది. రెండు డెయిరీల నుంచి 5050 శాతం చొప్పున తీసుకోవాలని దేవాదాయశాఖలో ఓ కీలక అధికారి ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. 'విజయ' నెయ్యిని మాత్రమే తీసుకోవాలని దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశాలిచ్చినప్పటికీ కొందరు రాష్ట్రస్థాయి అధికారులు కొత్త ప్రతిపాదన తెస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

# హెచ్1బీ వీసాలకు నేనెప్పుడూ అనుకూలమే: డొనాల్డ్ ట్రంప్

**తెలంగాణ ముచ్చట్లు సెంట్రల్ డెస్క్**

హెచ్ 1బీ వీసాల విస్తరణపై అమెరికా ప్రెసిడెంట్ ఎలక్ట్ డొనాల్డ్ ట్రంప్ వైఖరి మారింది. గతంలో హెచ్ 1బీ వీసా ప్రోగ్రామ్‌ను వ్యతిరేకించిన ట్రంప్, తాజాగా దానికి మద్దతు ప్రకటించారు. హెచ్ 1బీ వీసా విస్తరణను ఒక గొప్ప కార్యక్రమంగా అభివర్ణించిన ట్రంప్, ముందు నుంచి తాను దీనికి అనుకూలంగానే ఉన్నానని తెలిపినట్లు న్యూయార్క్ పోస్టు పేర్కొంది.

**వైఖరి మారింది!**

తొలిసారి అధికారం చేపట్టినప్పుడు హెచ్ 1బీ వీసాలపై ఆంక్షలు విధించిన ట్రంప్, అవి దుర్వినియోగం అవుతున్నాయని అన్నారు. ఈ హెచ్ 1బీ వీసాల వల్ల అమెరికాపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతోందని వ్యాఖ్యానించారు. అమెరికన్ కార్మికుల స్థానంలో విదేశీ ఉద్యోగులకు తక్కువ జీతం ఇస్తూ భర్తీ చేయడానికి కంపెనీలు హెచ్ 1బీ వీసాలను సాధనంగా ఉపయోగిస్తున్నాయని విమర్శించారు. కోవిడ్ 19 మహమ్మారి కారణంగా ఏర్పడిన ఆర్థిక సవాళ్లకు ప్రతిస్పందనగా 2020లో హెచ్ 1బీ వీసాల జారీపై మరింత కఠినతరమైన ఆంక్షలు కూడా విధించారు.



అయితే హెచ్ 1బీ వీసాల విస్తరణపై ట్రంప్ మద్దతుదారుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎలాన్ మస్క్, భారతీయ అమెరికన్ వ్యాపారవేత్త వివేక్ రామస్వామి చట్టబద్ధమైన వలసలకు మద్దతు ఇస్తుండగా, రిపబ్లికన్ పార్టీలోని మరికొందరు అమెరికా ఫస్ట్‌కే జైకొడుతున్నారు.

**మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్-మగా**

భారత్ వంటి దేశాల నుంచి నిపుణులైన వారిని నియమించుకోవడాన్ని పూర్తిగా ఆపేయాలంటూ మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్‌మగాకు మద్దతిస్తున్న నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి చర్యలు అమెరికా ఫస్ట్ లక్ష్యాన్ని పక్కదారి పట్టిస్తాయని వారు వాదిస్తున్నారు. ఇమిగ్రేషన్ విధానాల వల్లే అమెరికన్లకు అవకాశాల్లేకుండా పోతున్నాయని ఆరోపిస్తున్నారు. ట్రంప్‌నకు అత్యంత నమ్మకమైన మద్దతుదారులైన లూమర్, ఆన్ కౌల్టర్, మాజీ కాంగ్రెస్ సభ్యుడు మాట్ గేట్జ్ వంటి నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎలాన్ మస్క్, రామస్వామి అమెరికన్ కార్మికులను అణగదొక్కారని ఆరోపించారు. రిపబ్లికన్ పార్టీలోని కీలక నేత నిక్కీ హేలీ సైతం వివేక్ రామస్వామి వ్యాఖ్యాలను తీవ్రంగా ఖండించారు. అమెరికన్లకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, అమెరికా సంస్కృతిలో ఎటువంటి లోపం లేదని అన్నారు.


"ఓ చేత కమండలం
మరోచేత త్రిశూలంతో
నువ్వు స్మశానంలో తిరుగుతుంటే ,
నెత్తిమీద పాపాల మూట మోస్తూ
మేము నీ గుడి చుట్టూ
తిరుగుతున్నాము శివయ్యా..!! "



రాధికా ప్రియ

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
తెలుగు దిన పత్రిక
www.telanganamuchatlu.in


# గేమ్ ఛేంజర్‌లో రామ్‌చరణ్ నట విశ్వరూపం



రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ తెరకెక్కించిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. కియారా అడ్వాణీ కథానాయిక. దిల్‌రాజు నిర్మించారు. ఈ చిత్రం జనవరి 10న రానుంది. ఈ నేపథ్యంలో ఆదివారం విజయవాడలో అభిమానులు ఏర్పాటు చేసిన 256 అడుగుల రామ్ చరణ్ భారీ కటౌట్‌ను నిర్మాత దిల్‌రాజు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సినిమాలో రామ్‌చరణ్ నట విశ్వరూపాన్ని చూస్తారు. జనవరి 4 లేదా 5 తేదీల్లో ఏపీలో సినిమాకు సంబంధించిన భారీ కార్యక్రమాన్ని నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నాం. దీనికి సంబంధించి త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి చర్చిస్తాం. చిరంజీవి ఈ సినిమా చూసి సంక్రాంతికి భారీ హిట్ ఖాయమని, అభిమానులకు ఈ విషయాన్ని చెప్పమని ఫోన్ చేసి మరీ చెప్పారు. సినిమాలకు పుట్టినిల్లయిన విజయవాడలో భారీ కటౌట్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. జనవరి 1న ట్రైలర్‌ను విడుదల చేస్తామ"ని చెప్పారు. 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు..

రామ్ చరణ్ భారీ కటౌట్‌కు 'ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు లభించింది. దీనికి సంబంధించిన ధ్రువపత్రాన్ని ఆ సంస్థ విజయవాడ కోఆర్డినేటర్ పెద్దేశ్వర్.. దిల్‌రాజు, రామ్‌చరణ్ యువశక్తి ప్రతినిధులు, మెగా ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులకు అందించారు. ఈ సందర్భంగా హెలికాప్టర్ ద్వారా భారీ కటౌట్‌పై పూల వర్షా న్ని కురిపించారు. అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.



# 'బ్యాట్‌మ్యాన్ 2' మళ్లీ వాయిదా

ఆ' వెలుగు ఆకాశాన్ని తాకిందంటే అది ఒక సందేశం మాత్రమే కాదు హెచ్చరిక కూడా" అంటూ 'ది బ్యాట్‌మ్యాన్' సినిమాతో ఓ సరికొత్త ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు మాట్ రీవ్స్. ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న ఫిక్షనల్ పాత్ర బ్యాట్‌మ్యాన్‌ను ఆధారంగా చేసుకొనే ఈ చిత్రాన్ని తెరకెక్కించారు మాట్ రీవ్స్. 2022లో విడుదలైన ఈ సినిమాలో గోథమ్ సిటీలో చీకటి శక్తులను ఎదుర్కొనే క్రమంలో బ్యాట్‌మ్యాన్ చేసిన విన్యాసాలు అభిమానులను కట్టిపడేశాయి. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా 'బ్యాట్‌మ్యాన్ 2' రాబోతున్న సంగతి తెలిసిందే. వార్నర్ బ్రదర్స్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రాబర్ట్ ప్యాటిన్సన్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ సూపర్ హీరో చిత్రాన్ని 2026లో విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది చిత్రబృందం. ఇప్పటికే పలుసార్లు వాయిదా పడుతూ వస్తోన్న ఈ సినిమా కోసం అభిమానులు ఇంకొన్ని రోజులు వేచి చూడాల్సిందే. తాజాగా ఈ చిత్రాన్ని 2027 అక్టోబరు 1న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. తొలి భాగాన్ని మించేలా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు, నాణ్యతపై దృష్టి పెట్టి ఈ సినిమా విడుదలకు ఎక్కువ సమయం తీసుకుంటున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.





# హరియాణాకే పట్టం

: ప్రొ కబడ్డీలో హరియాణా స్టీలర్స్ ఆశ నెరవేరింది. గత సీజన్లో ఫైనల్‌కు వచ్చినా రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకున్న ఆ జట్టు.. ఈసారి టైటిల్ పట్టేసింది. ప్రొ కబడ్డీ సీజన్-11లో ఆరంభం నుంచి స్థిరంగా రాణించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన హరియాణా.. ఆదివారం జరిగిన ఫైనల్లోనూ అదే జోరు ప్రదర్శించింది. 32-23తో మూడుసార్లు ఛాంపియన్ పట్నా పైరేట్స్‌ను ఓడించి తొలిసారి విజేతగా అవతరించింది. ఒక దశలో హరియాణా-పట్నా 7-7తో సమంగా నిలిచాయి. కానీ అక్కడ నుంచి హరియాణా దూకుడు పెంచింది. శివమ్, రెజా, వినయ్ అదరగొట్టడంతో ప్రత్యర్థిని ఆలౌట్ చేసి పాయింట్లలో ముందంజ వేసింది. విరామానికి 15-12తో ఆధిక్యంలో నిలిచింది. బ్రేక్ తర్వాత పట్నా కాస్త పుంజుకున్నా.. హరియాణా పట్టు వదల్లేదు. శివమ్ (9), రెజా (7), వినయ్ (6) స్టీలర్స్ విజయంలో కీలకపాత్ర పోషించారు.





## డబ్ల్యూటీసీ ఫైనల్..

# సఫారీలతో తలపడేది ఎవరు?

దక్షిణాఫ్రికా వరుస టెస్టు విజయాలతో దూసుకుపోతోంది. సొంతగడ్డపై పాకిస్థాన్‌తో ఉత్కంఠభరితంగా సాగిన తొలి టెస్టులో రెండు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. ఈ గెలుపుతో సఫారీలు వచ్చే జూన్‌లో లార్డ్స్‌లో జరగనున్న డబ్ల్యూటీసీ ఫైనల్ తొలి బెర్త్‌ను ఖరారు చేసుకుంది. దీంతో ఫైనల్‌లో దక్షిణాఫ్రికాతో తలపడే మరో జట్టు ఏది? అని అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. పాయింట్ల పట్టికలో రెండు, మూడు స్థానాల్లో ఉన్న ఆస్ట్రేలియా (58.89) భారత్ (55.88) మాత్రమే మరో బెర్తును ఖరారు చేసుకోవడానికి ఎక్కువ అవకాశాలున్నాయి. భారత్ ఫైనల్ చేరాలంటే సమీకరణాలు ఇలా.. ప్రస్తుతం జరుగుతున్న బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌ను టీమ్ఇండియా 2-1తో కైవసం చేసుకుంటే ఫైనల్‌కు వెళుతుంది. కానీ, అలా జరగాలంటే శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో ఆస్ట్రేలియా ఒక మ్యాచ్‌లో మాత్రమే గెలవాలి. ఒకవేళ బీజీటీ సిరీస్ 2-2తో డ్రా అయినా భారత్‌కు అవకాశం ఉంటుంది. అప్పుడు శ్రీలంకతో సిరీస్‌లో ఆసీస్ ఒక్క మ్యాచ్‌లోనూ విజయం సాధించకూడదు.బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్ 1-1తో ముగిసినా భారత్ కు ఛాన్స్ ఉంది. అలా జరగాలంటే ఆసీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను శ్రీలంక 1-0తో గెలవాలి. ఈ సమీకరణాలతో సంబంధం లేకుండా టీమ్ఇండియా నేరుగా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరాలంటే.. ఆసీస్‌తో ప్రస్తుతం జరుగుతున్న నాలుగో టెస్టుతోపాటు, సిడ్నీలో జరిగే చివరి మ్యాచ్‌లో తప్పక గెలవాల్సి ఉంటుంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in